honeybee.org
Vol-6 Issue-2

సంపుటి 6 సంచిక 1 జనవరి-ఫిబ్రవరి 2018

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక






















## పల్లెసృజన 60వ సంచిక

# నా ఇల్లా? మీ ఇల్లా? రాజుగారి సందిగ్ధం



రాజుగారి తోటలో చాలా చెట్లుండేవి. కానీ అందులో ఆయనకొక చెట్టంటే అమితమైన ప్రేమ. అది ప్రత్యేకమైన పెద్ద చెట్టు. విస్తరించిన దాని కొమ్మలమీద రకరకాల పక్షులు, పురుగులు, ఉడతలు, చీడపురుగులు, కీటకాలు కూడా నివసిస్తూ ఉండేవి. ప్రశాంతంగా జీవిస్తున్న వాటి జీవితంలో అలజడి వచ్చింది. ఒకరోజు ఆ జీవులన్నీ కంగారుగా మాట్లాడుకోసాగాయి. దానికి కారణం రాజుగారు ఆ చెట్టును నరికించేయాలని అనుకున్నాడట! జీవులన్నీ తమ గతేంటని తీవ్రంగా చర్చించుకోసాగాయి.

ఒక పిచ్చుక "ఔనూ, రాజుగారికి ఇష్టమైన ఈ చెట్టును ఎందుకు కొట్టేస్తున్నాడట? ఆయన అసలీ కొమ్మల్నే ఎవర్నీ ముట్టుకోనిచ్చేవారు కాదే" అన్నది. అప్పుడు ఉడత "రాజుగారి భవనంలోని ఒక కర్ర స్తంభానికి చీలిక వచ్చిందట, అది లేకపోతే ఆ భవనమే కూలిపోతుందట. అందుకే దానిని బాగు చేయించటానికి ఈ చెట్టును నరికేయిస్తున్నాడు" అన్నది. అందుకు గబ్బిలం "తన ఇంటిని కాపాడుకోవటం కోసం మన ఇంటిని నాశనం చేయటం సమంజసమేనా? దీనికి మనమేదైనా చెయ్యాలి, అలా జరగనివ్వకూడదు" అన్నది. దానికి ఉడత "మనమేం చేయగలం, ఆయనేమో మహారాజు" అన్నది. అప్పుడు అక్కడున్న ప్రతి జీవి "ఏం ఎందుకు చేయలేము, ఆయన దేశాన్ని బహిష్కరించి వెళ్ళిపోదాం, అతనేం చేస్తాడో చూద్దాం. ఆయన రాజైతే అయి ఉండవచ్చు, కానీ మనల్నేం చేయగలడు? మనల్ని ఆపగలడా? ఆయనని, ఆయన రాజ్యాన్ని జీవాలు లేని చెట్లతో ఉండమందాం" అని నిర్ణయించుకున్నాయి. అలాగని రాజుగారికి వర్తమానం పంపాయి. రాజుగారికి ఏం చేయాలో తోచలేదు. ఓపక్క వడ్రంగులు రాజభవనంలోని విరిగిన స్తంభాన్ని బాగు చేయటానికి ఆ చెట్టు చెక్కే కావాలన్నారు. లేకపోతే ఈ భవనం కూలిపోతుంది, మీరీ భవనం వదిలి వెళ్ళిపోవాల్సి వుంటుంది అన్నారు. రాజు తన భవనాన్ని రక్షించుకోవటం కోసం చెట్లమీద నివసించే జీవాల్ని వెళ్ళగొట్టాలనుకుంటున్నాడు కానీ, జీవాలు లేని రాజ్యంలో తానుండ గలడా? పక్షుల కిలకిల రావాలు, చీమల బారులు లేని రాజ్యంలో తాను రాజుగా రాజసౌధంలో జీవించగలడా?

రాజేం చేశాడు? అది సరే మీరైతే ఏం చేస్తారు?

**– హనీబీ 16(2) – 2015.**

# పల్లెసృజన

సంపుటి-6 సంచిక - 2 జనవరి - ఫిబ్రవరి 2018

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం,**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్,**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ,**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్,**
**జమ్ములమడక శ్రీకర్,**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 800/-**
**for 5 years Subscription**

## ఈ సంచికలో...

సృజనాత్మకతకు పురిగొల్పిన
కులవృత్తి
**ప్రవీణ్ వీడర్**


3


7

అమ్మకానికి సిద్ధంగా ఉన్న
**గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు**

నేను - పల్లెస్పజన
**జమ్ములమడక శశిమోహన్**


10


11

మిరపలో
**రికార్డు స్థాయి దిగుమతి-రెట్టింపు విలువ**


13

**'పల్లెస్పజన' స్వప్నం**
**జమ్ములమడక శ్రీకర్**


14

పల్లెస్పజన 60వ
సంచిక - మధుర స్మృతి
పి. చంద్రకాంత్ శర్మ


15

**సాత్విక్-2017**

9వ జాతీయ
ద్వైవార్షిక పోటీలు
- బహుమతి పొందిన ఇన్నోవేషన్లు


18


22

**స్ప్రేయర్ల సుభాని**
**సరికొత్త ఇన్నోవేషన్**
**తోపుడు స్ప్రేయర్**


24

ఆయుర్వేద జ్ఞాన మథనం
'వాము'తో వైద్య చిట్కాలు


27

'పల్లెస్పజన'తో
నా ప్రయాణం....
- పల్లె వీర రాఘవ రెడ్డి

25వ
**చిన్నశోధయాత్ర-జ్ఞాన యాత్ర**


28

కవర్ లోపలి పేజీల్లో ... **నా ఇల్లా? మీ ఇల్లా? రాజుగారి సందిగ్ధం** హనీబీ కథ, అమ్మకానికి సిద్ధంగా వున్న 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'

మధ్య పేజీలో : **'పల్లెస్పజన' పాల్గొన్న ప్రదర్శనలు**

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# పల్లెసృజన 60వ సంచిక .....

2005 నవంబరులో 'పల్లెసృజన' ఆవిర్భవించినా, పత్రిక మాత్రం మే, 2006 లో ప్రారంభమైంది. ప్రథమ సంచిక మే–జులై 2006లో త్రైమాసిక పత్రికగా కీ.శే. డా. పుష్ప భార్గవ్, ప్రొఫెసర్ అనిల్ గుప్తా గార్ల చేతుల మీదుగా, ఇన్నోవేటర్లు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తల సమక్షంలో ఆవిష్కరించబడింది. ఆనాడు పత్రిక పేరు "హనీబీ". ఆ తర్వాత సంచిక నుంచి "పల్లెసృజన"గా మారింది. అప్పటినుంచి సంస్థ – పత్రిక రెండు ఒకే పేరుతో నిర్వహించ బడుతున్నాయి. 'పల్లెసృజన' సేకరిస్తున్న పల్లె జ్ఞానాన్ని పదిమందికి చేర్చాలంటే పత్రిక ఒక చక్కని మాధ్యమంగా ఉపయోగ పడుతుందన్న ఉద్దేశ్యంతో పత్రికను స్వచ్ఛంద సంపాదక వర్గం సౌజన్యంతో ముందుకు సాగుతున్నాం.

"ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే భావ స్వాతంత్ర్యం ఉంటుంది" అన్న గాంధీ గారి ఉపదేశాన్ని పాటించాలన్న తపనతో ఈ పత్రిక ఎటువంటి వ్యాపార ప్రకటనలు, స్పాన్సర్‌షిప్‌లను ప్రోత్సహించలేదు. ఒక్క మొదటి సంచిక తప్ప ఇంతవరకు వెలువడిన 59 సంచికలను ఈ సిద్ధాంతపైనే నడిపించాము. ఆర్థికంగా అనుకూలంగా లేకపోయినా ఈ పద్ధతి మాకందరికీ ఎంతో తృప్తినిచ్చింది. పత్రిక తయారవడానికి కావలసిన పనులన్నీ స్వచ్ఛందంగా వాలంటీర్లు చేస్తున్నారు. ప్రింటింగ్, పోస్టేజీల ఖర్చులకు సభ్యత్వ రుసుము బొటాబొటిగా సరిపోతుంది. వీరందరి అద్భుత సహకారంతో గత 12 సంవత్సరాలుగా పల్లెసృజన పత్రిక ప్రయాణం 60వ సంచికకు చేరుకుంది. ఈ సందర్భంలో సృజనాత్మకతను పంచుకున్న వందలాది ఇన్నోవేటర్లకు, సాంప్రదాయ జ్ఞానులైన మూలికా వైద్యులకు, సభ్యత్వం కట్టి, పల్లెసృజన ప్రయాణాన్ని కొనసాగించిన పాఠకులకు, వేల వాలంటీర్లకు ఈ పండగ సందర్భంగా కృతజ్ఞతలు, శుభాకాంక్షలు.

వాలంటీర్లు ప్రతినెలా ఇన్నోవేషన్లను వెతికి వెలుగులోకి తీసుకు రావడానికి సిద్ధమైన తర్వాత ఈ పత్రికను త్రైమాసిక పత్రిక నుండి ద్వైమాసిక పత్రికగా 2012 నుంచి మార్పు చేయడం జరిగింది. ఈ రకంగా 60 సంచికలు క్రమం తప్పకుండా గత 12 ఏళ్ళుగా నిరంతరంగా ప్రచురించి పాఠకులకు అందిస్తున్నాం. ఈ పత్రిక ఎల్లప్పుడూ నూతన ఇన్నోవేషన్లతో మీ చేతుల్లోకి వచ్చిందంటే దానికి కారణం వాలంటీర్లు మారుమూల గ్రామాల్లోకి వెళ్ళి, ఇన్నోవేటర్లను, జ్ఞానకర్తలను శోధించి, వారి కథనాలు, వీడియోలు, ఫోటోలు సేకరించడం, వారిని 'పల్లెసృజన' కుటుంబంలో చేర్చుకోవడం ఇవన్నీ పల్లెసృజన పత్రిక స్థిరంగా ప్రచురించడానికి పూర్తిగా దోహదపడ్డాయి.

ఈ పత్రిక నడపడంలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారి సహకారం కూడా ఎంతో వుంది. వారి అనుమతి వల్లే దేశం నలుమూలల నుంచి సేకరించిన పల్లె జ్ఞానాన్ని ప్రచురించడంతో, తెలుగు పాఠకులకు ఇతర రాష్ట్రాల్లోని సృజనలను గురించి తెలుసుకనే అవకాశం దక్కింది. ఇవే కాక రాష్ట్రపతి అవార్డులు పొందిన ఇన్నోవేషన్లు, శోధయాత్ర అనుభవాలు, స్కూలు పిల్లల ఇగ్నైట్ పోటీ వివరాలు, సాత్విక్ ఆహార పండుగలు లాంటి జాతీయ కార్యక్రమాల వివరాలు పల్లెసృజనలో ప్రచురించే అవకాశాలు కూడా లభించాయి. వారికి మనసారా కృతజ్ఞతలు.

'పల్లెసృజన' చేపట్టిన చిన్న శోధయాత్రలు ఇన్నోవేషన్ల ప్రదర్శనలు, మూలికా వైద్యుల సమావేశాలు, పల్లెసృజన కుటుంబ చర్చలు, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు, ఇవన్నీ కూడా పల్లెసృజన పత్రికలో ప్రచురించి మీకందరికీ ఈ వివరాలను అందించగలిగాం.



పల్లె వీర రాఘవరెడ్డి నేను కలిసి ప్రారంభించిన "పల్లెసృజన" దినదినవర్ధమానంగా పెరుగుతూ వచ్చింది. శశిమోహన్ గారి ఎడిటోరియల్ సామర్థ్యంతో పన్నెండేళ్ళ ప్రయాణం సాఫీగా జరిగింది. వేలకొద్ది పాఠకులు, సమాజంలోని అన్ని వర్గాలవారు ఈ పత్రికకు సభ్యత్వం కట్టి నడిపించారు. వ్యక్తులు, రైతులు, సంఘ సంస్కర్తలు, ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థలు, కళాశాలలు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు.... అంతా పల్లెసృజన పాఠకులైనందుకు మాకెంతో ఆనందంగా ఉంది.

'శోధయాత్ర' ఇదొక జ్ఞానయాత్ర. 'పల్లెసృజన' గత పన్నెండేళ్ళుగా సామాన్య ప్రజల అసామాన్య జ్ఞానాన్ని వెతికి వెలుగులోకి తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో సాగిస్తున్నదే ఈ శోధయాత్ర. ఈ ప్రయాణంలో పాల్గొనే వారికి ఏ అర్హతలూ అవసరం లేదు. వయస్సు, విద్య, హోదా, ధనం లాంటివేవీ ఈ యాత్రకు ప్రాతిపదిక కావు. కావలసిందల్లా "జ్ఞానంమీద గౌరవం, ప్రేమ, జ్ఞానాన్ని వెతికి పదిమందికి అందించాలన్న తపన". సామాన్య ప్రజల సృజనా శక్తి, సాంప్రదాయ జ్ఞానాన్ని సమానాంతరంగా పల్లెనుండి పల్లెకు పంచాలన్నదే ప్రధాన ఉద్దేశ్యం. ఇంతవరకు సాగిన ఈ అద్భుత జ్ఞాన యాత్రలు మున్ముందు మీ అందరి సహకారంతో మరింత నిర్దిష్టంగా, అర్థవంతంగా కొనసాగాలని మనసారా ఆశిస్తున్నాం.

ఈ పల్లె జ్ఞాన పత్రిక తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి పల్లెకు చేరాలన్న మా కోరిక త్వరలోనే నెరవేరాలని, మీరంతా ఈ లక్ష్య సాధనకై మీ స్వంత ఊరికి అయిదేళ్ళపాటు 'పల్లెసృజన' చేరేలా చందా కడతారని మనసారా కోరుకుంటూ...


'పల్లెసృజన' 60వ సంచిక విడుదల సందర్భంగా శుభాకాంక్షలు మీతో పంచుకుంటూ....

**భవదీయ**

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# సృజనాత్మకతకు పురిగొల్పిన కులవృత్తి

# ప్రవీణ్ వీడర్



- పల్లె వీర రాఘవ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగడపల్లి మండలం, చిన్న లింగాపూర్ గ్రామానికి చెందిన సత్తయ్య సత్తవ్వల ఏకైక సంతానం 30 సంవత్సరాల వయసుగల కొడిముంజ ప్రవీణ్ కుమార్. చదివింది కేవలం 7వ తరగతి. సత్తయ్యది కమ్మరి వృత్తి. కులవృత్తిలోనే మెళకువలు నేర్చుకున్న ప్రవీణ్‌కు గత ఏడాది 'లహిత' తో వివాహం కూడా అయింది. తాను తన కులవృత్తి పనులతో పాటు ఇతర పనులను కూడా నేర్చుకుని స్వంతంగా "రాజరాజేశ్వర మోటార్ వైండింగ్, వెల్డింగ్ వర్క్స్' పేరుతో షాపును ఏర్పాటు చేసుకున్నాడు. తన గ్రామం, ప్రక్క గ్రామాల్లోని రైతులను తన నైపుణ్యమైన పనులతో ఆకట్టుకున్నాడు. తాను చేసే ప్రతి పనిలోనూ ఒక వినూత్నత ఉండాలని కోరుకునే వ్యక్తి ప్రవీణ్.

తమ ప్రాంతం పూర్తిగా మెట్ట వ్యవసాయంపైనే ఆధార పడి వుంటుంది. నీటి మట్టం కూడా తక్కువగా వుండటంతో ఎక్కువ బోర్లు కూడా లేవు. ప్రధాన పంటలు ప్రత్తి, మొక్కజొన్న, మిరప ఇతర పంటలు. ఆ ప్రాంత రైతులు ఇతని వద్ద కొన్ని సైకిల్ ఆధారిత చేతితో పనిచేసే పరికరాలను చేయించుకుని వాటితో తమ వ్యవసాయ పనులను చేసుకుంటూ వుండేవారు. ఇలాంటి సమయంలో ప్రవీణ్‌కు ఈ రైతులు ఇలా చేతితో పనిచేసే పరికరాలకు బదులుగా తక్కువ ఖరీదులో అందుబాటయ్యేలా మోటార్ వీడర్‌ను తయారు చేయిస్తే బావుంటుందని భావించి, మొదట 'సుజుకి' మోటార్ సైకిల్ ఇంజన్‌ను సైకిల్‌కు మధ్యలో ఏర్పాటు చేసి పొలం పనిచేసేలా ఒక వీడర్‌ను తయారు చేశాడు. దాని వేగం నియంత్రించలేక పోవడంతో ఆ పరికరం అనుకున్న విధంగా పని చేయలేక పోయింది. దాని వేగాన్ని నియంత్రించే శక్తి మనుషులకు ఉండదని గ్రహించి తన ఆలోచనను అంతటితో



ఆపకుండా ఆ మోటార్ సైకిల్ ఇంజన్ స్థానంలో ఒక పాత స్కూటర్‌ను కొనుగోలు చేసి దాని ఇంజన్ వేగాన్ని నియంత్రించేలా మరో వీడర్‌ను రూపొందించాడు.

మామూలుగా పొలం దున్నేటపుడు రైతు ఎలా నడవ గలడో అంతే వేగంతో ఈ యంత్రం పరిగెత్తేలా వేగాన్ని నియంత్రించాడు. ఎద్దులతో సేద్యం చేసినట్లుగానే ఈ యంత్రంతో రైతు పనిచేసే విధంగా ఆ యంత్రాన్ని ఎంతోమంది రైతులచే పొలంలో దున్నిస్తూ వారి సూచనల మేరకు ఈ వీడర్‌కు ఎన్నో మార్పులు చేర్పులు చేశాడు ప్రవీణ్. మొత్తానికి ప్రవీణ్ కన్న కల రెండు సంవత్సరాల కష్టంతో విజయవంతం అయింది. అందరు రైతుల సలహా, సూచనల మేరకు వారికి అవసరమైన అన్ని రకాల మార్పులు చేర్పులు చేయటంతో చుట్టు ప్రక్కల రైతులు ప్రవీణ్ వీడర్‌ను ఎంతో మెచ్చుకోవటమే కాదు, దాన్ని వినియోగించిన రైతుల ఆనందం చూసి ప్రవీణ్ హమ్మయ్య! రైతుకు తగిన పరికరం తయారు చేయ గలిగానని ఎంతో సంతోషించాడు.

గత రెండు మాసాల్లో ఇలాంటి పరికరాలు 5 తయారు చేసి తన సమీప గ్రామ ప్రజలకు అమ్మటం జరిగింది. దాన్ని వినియోగిస్తున్న రైతులు కూడా ఈ పరికరం వల్ల తమకు ఎంతో లాభం చేకూరిందని తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒక జత ఎద్దులు కొనాలంటే కూడా కనీసం లక్ష రూపాయలు అవుతుందని, అంతర సేద్యాలకు కాడెద్దులను కిరాయికి పిలిస్తే కూడా రోజుకు వెయ్యి రూపాయలకు పైగానే తీసుకుంటున్న ఈ రోజుల్లో కేవలం ఎకరాకు ఒకటిన్నర రెండు లీటర్ల పెట్రోలు ఖర్చుతో రోజుకు పనిచేసే మనిషి సామర్థ్యాన్ని బట్టి 5 నుండి 7 ఎకరాలు సులభంగా దున్నుకునే అవకాశం కల్పించటం ఎంతో లాభదాయకమని అంటున్నారు రైతులు. అంతేకాక ప్రత్తి లాంటి పంటల్లో అంతర పంటల్లో కలుపు నివారణకు నేడున్న పరిస్థితుల్లో కూలీల భారం మోయలేనిదిగా వుంది, ఎద్దులతో అంతర సేద్యాలు చేయాలంటే ఊర్లో అతి తక్కువ మంది ఎద్దులను కిరాయికి పంపేవారున్నారు. ట్రాక్టర్‌తో అంతర సేద్యాలు చేయటానికి వీలుండదు. ఈ పరిస్థితులన్నింటిని ఈ పరికరం ద్వారా అతి సులభంగా తీర్చగలిగాడు ప్రవీణ్ అని మెచ్చుకున్నారు ఆ ప్రాంత రైతాంగం.

సిరిసిల్ల పరిసరాల్లో ఈమధ్య ఉద్యాన తోటలు కూడా చాలామంది ఏర్పాటు చేసుకుంటున్నారు. అటువంటి రైతులకు చెట్ల చుట్టూ కలుపు నివారణ ఎంతో ఖర్చు కూడుకున్నది అవుతోంది. ఈ సమస్యకు ప్రవీణ్ తయారు చేసిన వీడర్ ఎంతో ఉపయుక్తంగా ఉందని ఆ ప్రాంత రైతాంగం అంటున్నారు.

జీవనాధారం కోసం మోటార్ వైండింగ్, వెల్డింగ్, వడ్రంగి, కార్పెంటరీ లాంటి ఎన్నో పనులను చేసుకునే ప్రవీణ్ ప్రస్తుతం తన వీడర్ల తయారీకే ఎక్కువ సమయాన్ని కేటాయించే పరిస్థితులు ఏర్పడుతుండటం తనకెంతో సంతోషంగా ఉందని అంటున్నాడు ప్రవీణ్.

తాను మొదట్లో ఈ వీడర్ తయారు చేస్తున్నప్పుడు గ్రామంలోనివారు నీకెందుకీ పని ఏదో వున్న పనులను హాయిగా చేసుకోక అని కొందరంటే, మొదట చేసిన వీడర్



ఫెయిలైనప్పుడు పెద్దపెద్ద కంపెనీల వీడర్లు కొనేందుకే దిక్కులేదు, ఇక నీవు తయారు చేసిన వీడర్లు ఎవరు కొంటార్రా బాబూ అని మరి కొందరు గేలి చేశారట. ఎలాగైనా సరే దీన్ని విజయవంతంగా పూర్తి చేయాలని దాదాపు 50 వేల రూపాయల దాకా ఖర్చు చేసి, రెండు సంవత్సరాల పోరాటం సలిపితే ఇప్పుడు విజయవంతమైన ఈ వీడర్ పనితనం వల్ల నేను పడ్డ కష్టాలు, నష్టాలు, నిష్ఠూరాలు అన్నీ మాయమై పోయాయని తన సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాడు ప్రవీణ్.

ప్రస్తుతం ఈ వీడర్‌ను 25 వేల రూపాయలకు రైతులకు అందజేస్తున్నానని, తాను రోజువారి పనులు చేసుకుంటూ జీవనం గడిపేవాడికి కాబట్టి రైతులు ఇచ్చిన అడ్వాన్సు డబ్బులతో ఎప్పటికప్పుడు వీడర్‌కు కావల్సి సామాన్లను కొనుగోలు చేసుకుని వచ్చి వాటిని తయారు చేసి ఇవ్వటం వల్ల నాకు ఖర్చు ఎక్కువ అవుతుందని, తగినంత ఆర్థిక సహాయం అందితే కనీసం పది వీడర్లకు తగిన సామాగ్రి ఒకేసారి కొనుగోలు చేస్తే కాస్త తక్కువ ధరకే సామాన్లు లభించటంతో పాటు, పని కూడా ఒకేసారి చేసుకోవటం వల్ల కొంత ఖర్చు కలిసి వస్తుందని, అలా జరిగితే రైతులకు కూడా ఇంకా తక్కువ ధరకే వీడర్‌ను అందించ గలనని ధీమా వ్యక్తం చేస్తున్నాడు.

ప్రస్తుతం స్కూటర్ ఇంజన్లు లభిస్తున్నందున వాటితోనే తయారు చేస్తున్నానని, మున్ముందు డీజిల్ ఇంజన్‌తో కూడా తయారు చేసి చూడాలనుకుంటున్నట్లు తెలియజేశాడు ప్రవీణ్. డీజిల్ ఇంజనైతే ఇంకాస్త బరువుగా వుండటం వల్ల ఎక్కువ లోతు కూడా దున్నే అవకాశముంటుందని అంటున్నాడు. తాను చదువుకోక పోయినా, తన భార్య లహిత ఇంటర్ వరకు చదువుకోవటం వల్ల నాకు తెలియని విషయాలను ఆమె తెలియజేస్తూ తనకెంతో సహాయ కారిగా వుంటోందని, తాను చేసే ప్రతి విషయంలో ఆమె సంపూర్ణ సహకారం నాకు లభిస్తోందని అంటున్నాడు ప్రవీణ్.

ప్రవీణ్ ఈ వీడర్‌తో పాటు దీనికి అనుసంధానం చేసే పనిముట్లు గొర్రు, నాగలి, గుంటక లేదా బోదెలు చేసే పరికరం కూడా అందిస్తానని అంటున్నాడు. భవిష్యత్తులో ఇలా మనిషి నడుపుకుంటూ వెళ్ళే వీడర్ కాకుండా మనిషి కూర్చుని అన్ని పనులు చేసుకునేలా 5 నుంచి 10 హార్స్‌పవర్‌ల సామర్థ్యం గల చిన్న ట్రాక్టరును తయారు చేసే ఆలోచన తనకుందని ఇది దాదాపు పెద్ద ట్రాక్టరు చేయగలిగే పనులన్ని చేస్తుందని, చిన్న సన్నకారు రైతులకు, మరీ ముఖ్యంగా ఉద్యాన వనాల రైతులకు ఇది ఎంతో ఉపయుక్తంగా వుంటుందని, ఈ ట్రాక్టరు ముందుకు వెనుకకు నడిచేలా గేర్లతో పాటు, హైడ్రాలిక్‌ను కూడా ఏర్పాటు చేయాలి అనుకుంటున్నాను అంటున్నాడు. ఈ ట్రాక్టరు కూడా సాధ్యాసాధ్యాలను పరిశీలించి 80 వేల రూపాయల లోపుగానే రైతుకు లభించేలా తన ఆలోచన వుందని అంటున్నాడు ప్రవీణ్. తాను రైతు శ్రేయోభిలాషినని, వారి కొరకు వీలైనంత తక్కువ ధరలో, ఎక్కువ శ్రమను, డబ్బును మిగిలించేందుకు ఎంతవరకైనా వెళ్తానని అంటాడు ప్రవీణ్.


ప్రవీణ్ తయారు చేసిన ఈ వీడర్ మున్ముందు యావత్ రైతాంగం వినియోగించుకుంటారని, ప్రభుత్వాలు కూడా పెద్ద పెద్ద కర్మాగారాలు తయారు చేసే ట్రాక్టర్లకు సబ్సిడీ ఇచ్చే బదులు, ఇలాంటి చిన్న చిన్న పరికరాలను రైతాంగానికి సరఫరా చేయగలిగితే రైతులు ఎంతో వృద్ధిలోకి రాగలరని ఆశిస్తోంది 'పల్లెసృజన'. ఈ వీడర్ కావాలనుకున్న వారు ఇన్నోవేటర్‌ను కాని, పల్లెసృజనను కాని సంప్రదించి పొందవచ్చు.

**ఇన్నోవేటర్ ప్రవీణ్ ఫోన్ : 88863 1657**

**పల్లెసృజన (రాఘవ రెడ్డి) : 81257 99904**

## ఎన్.ఐ.ఎఫ్. లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 25 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు,
సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై
ఒక వెబ్‌సైట్ తయారు చేసింది.
ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia.org లో చూడవచ్చు.
అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞాన కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే
**NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555**
కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.
కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు
ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.



## డా. ఎపిజె అబ్దుల్ కలాం

# ఇగ్నైట్ పోటీలు 2018

"నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది
సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది
ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి
జ్ఞానం మిమ్మల్ని గొప్పవాళ్ళను చేస్తుంది"

**'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - ఇండియా'** పాఠశాల విద్యార్థుల కొరకు వారి స్వంత సాంకేతిక ఆలోచనలు మరియు సృజనల జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నది.

**'డా. ఎపి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైట్ పోటీలు-2018'** కి దరఖాస్తులు పంపుటకు **చివరి తేది 31 ఆగస్టు, 2018.** ఎన్ఐఎఫ్ పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే మన మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఎపిజె అబ్దుల్ కలాం గారి జయంతి రోజు (అక్టోబర్ 15)న విజేతల పేర్లు ప్రకటిస్తుంది.

అర్హమైనవి అని భావించిన ఇన్నోవేటివ్ ఐడియాలు/ప్రాజెక్టులను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' గుర్తించి, వాటి అభివృద్ధికి, పేటెంట్‌కు సహకరిస్తుంది. 12వ తరగతి (10+ ఇంటర్మీడియట్) వరకు చదువుతున్న విద్యార్థులు (పాఠశాలేతర విద్యార్థులు, 17 సంవత్సరాల లోపు చిరంజీవులు కూడా) తమ ఎంట్రీలను తమ చిరునామా, పిన్ కోడ్, సెల్ ఫోన్‌తో సహా ఒక కాగితంపై వివరంగా వ్రాసి పోస్టు ద్వారా ఈ క్రింది చిరునామాలకు, లేదా ఈ-మెయిల్ ignite@nifindia.org ద్వారా పంపవచ్చు. ఆన్‌లైన్‌లో ద్వారా కూడా పంపవచ్చు.

పూర్తి వివరాలకు సంప్రదించండి :
**www.nif.org.in/ignite**

National Innovation Foundation-India
Grambharati, Amarapur, Gandhinagar- Mahudi Road,
Gandhinagar - 382650, Gujarat, India.
Tel : 02764 261131/ 32/ 38/ 39, Fax : 011 43851803
E-mail : ignite@nifindia.org, web : www.nif.org.in/ignite

dst.gov.in | honeybee.org | gian.org | sristi.org | cbse.nic.in



# అమ్మకానికి సిద్ధంగా ఉన్న గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## విత్తనాలు నాటి ఎరువులు వేసే చేతి పరికరం

**సమస్య – పరిష్కారం :**

వ్యవసాయంలో విత్తనాలు వేయటమనేది చాలా ముఖ్యమైన కార్యక్రమం. సరైన సమయంలో, సరైన పద్ధతిలో విత్తనాలు నాటకపోతే మొత్తం పంట దెబ్బతినే ప్రమాదముంది. దీనికి రైతులు వివిధ రకాల పద్ధతులను వాడుతూ వుంటారు. స్థితిమంతులైన రైతులు ట్రాక్టర్లు వాడినా, ఎక్కువ సంఖ్యలో వుండే పేద రైతులు చేతితో విత్తనాలు నాటడం కష్టమైన పనిగానే వుంటుంది. సాంప్రదాయ పద్ధతిలో చేతులతో విత్తనాలు నాటడానికి మనిషి వంగి, చేతితో గుంత చేసి, విత్తనం వేసి మళ్ళీ మట్టిని పూడ్చవలసి వుంటుంది. మరళా రెండవ విత్తనం వేయటానికి ఇదే పద్ధతి అవలంభించాలి. ఇలా కొన్ని వేలు, లక్షల్లో విత్తనాలు వేయాల్సి వుంటుంది. ఇదంతా ఎంతో శ్రమతో కూడుకున్న పని, ఇలా చేయటం వల్ల నడుం నొప్పితో చాలా ఇబ్బంది పడ్డ రైతులు, కూలీలు కూడా ఉన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మనిషి వంగి పని చేయాల్సిన అవసరం లేకుండా, నిలబడే గుంత చేసి, విత్తనం వేసి, పూడ్చేసేలా ఒక పరికరాన్ని తయారు చేశాడు గుజరాత్‌కు చెందిన 'మన్సుక్ భాయ్ డిగాని'.



**పరికరం :**

ఈ పరికరం ఒక గొట్టం రూపంలో వుండి, క్రింది భాగంలో భూమిలోకి చొచ్చుకొని పోయే విధంగా మొనదేలి వుంటుంది. పై భాగంలో విత్తనాలు, ఎరువులు వేసుకోవటానికి అనువుగా ఒక పెట్టెను ఏర్పాటు చేసి వుంటుంది. ఈ గొట్టంలో స్ప్రింగు అమర్చబడిన ఒక ఇనుప కడ్డీ వుంటుంది. అది పైన ఏర్పాటు చేసిన ఒక లివర్‌ను నొక్కినపుడు విత్తనం డబ్బా తెరుచుకుని విత్తనం నేలలోకి దిగుతుంది, దాన్ని పైకి గుంజి కాలితో మట్టిని మూసివేస్తే సరిపోతుంది. ఇదేవిధంగా ఎరువును కూడా వేసుకోవచ్చు.



**సాంకేతిక వివరాలు :**

- మనిషి వంగకుండా పని చేయటానికి వీలుగా ఉంటుంది.
- ఎంత లోతు అవసరమనుకుంటే అంత లోతుగా భూమిలోకి చొప్పించవచ్చు.

**ముఖ్యాంశాలు :**

- దీనితో పని చేయటం చాలా సులువు.
- సమయము, కూలీల ఖర్చులు ఆదా చేసుకోవచ్చు.
- శారీరక శ్రమ చాలా తక్కువ.
- ఒకే రకంగా విత్తనం వేయటం వలన మొలక శాతం పెరిగే అవకాశముంటుంది.
- విత్తనాలు, ఎరువులు వృధా కావు.
- తక్కువ ఖర్చులో పనైపోతుంది.

# వివిధ పంటల నూర్పిడి యంత్రం

**సమస్య – పరిష్కారం :**

దేశంలో ఏ మూల వున్న రైతుకైనా ధాన్యం ఎక్కువగా నష్టపోకుండా, శుభ్రమైన గింజలను అందించే నూర్పిడి యంత్రం ఎంతో అవసరం. మార్కెట్లో రకరకాల నూర్పిడి యంత్రాలు అందుబాటులో వున్నా, ఒక్కో పంటకు ఒక్కో రకం యంత్రాలు ఉంటాయి. అవి కూడా ధాన్యం నష్టం ఎక్కువగా జరగకుండా నియంత్రించలేక పోవడమే కాదు, శుభ్రమైన ధాన్యాన్ని కూడా అందించలేవు. ఈ సమస్యలన్నీ పరిష్కరించేందుకు దాదాపు అన్ని రకాల ధాన్యాలను నూర్పిడి చేసేందుకు ఒకే యంత్రం తయారు చేశారు రాజస్థాన్‌కు చెందిన 'మదన్‌లాల్ కుమావత్'. ఈ యంత్రం తక్కువ ధాన్యం నష్టంతో, ఎక్కువ శుభ్రమైన ధాన్యాన్ని రైతుకు అందిస్తుంది.



**పరికరం :**

మదన్‌లాల్ బజార్లో లభించే ఇతర నూర్పిడి యంత్రాలలో వుండే ఇబ్బందులన్నింటిని అధిగమిస్తూ, ఎక్కువ సామర్థ్యం కల అనేక రకాలైన పప్పుదినుసు పంటలు, ధాన్యాలే కాక, కొద్దిపాటి మార్పులతో వేరుశనగను కూడా నూర్పిడి చేసుకునే విధంగా దీన్ని రూపొందించాడు. దీనిలో నూర్పిడి చేసుకున్న తర్వాత తిరిగి ఏ రకమైన శుభ్రపరిచే ప్రక్రియ చేపట్టకుండానే నేరుగా మార్కెట్‌కు తరలించవచ్చు. ఒక ధాన్యం నుండి మరో ధాన్యం నూర్పిడి చేసుకునేలా పరికరంలో మార్పు చేయాల్సిన సమయం కూడా పదిహేను నిమిషాలకు మించదు. ధాన్యపు గడ్డి లేదా చొప్పలను కూడా చిన్న చిన్న ముక్కలుగా చేసి ధాన్యంతో పాటు కాకుండా వేరే ద్వారం ద్వారా బయటకు పంపిస్తుందీ యంత్రం.

**సాంకేతిక వివరాలు :**

- ఈ యంత్రంలో మూడు ముఖ్యమైన భాగాలుంటాయి.
- ఒకటి ధాన్యపు గడ్డి, వగైరాలను చొప్పించేది, రెండవది వాటిని ముక్కలుగా చేసేది, మూడవది వృధాను, ధాన్యాన్ని వేరు చేసేవిగా భాగాలుంటాయి.



- ధాన్యాలు మార్పు చెందినపుడు వీటిలో మొదటి భాగంలో మాత్రమే ఆ ధాన్యానికి అనువైన గేరును మార్చాల్సి వుంటుంది.
- యంత్రం కొలతలు : పొడవు – 3.9 మీ., వెడల్పు – 1.9 మీ., ఎత్తు 2 మీటర్ల వరకుంటుంది.
- 5 సిలిండర్ల గేర్ బాక్స్ కలిగి వుంటుంది.
- మూడు డ్రమ్ముల్లో బ్లేడ్లతో కూడిన 3 చక్రాలు అమర్చబడి వుంటాయి.
- యంత్రం మొత్తం రెండు టైర్ల చట్రంపై అమర్చబడి వుంటుంది.
- ఈ యంత్రం సామర్థ్యం గంటకు – గోధుమలు : 18–25 క్వింటాళ్ళు, పప్పు ధాన్యాలు - 14–18 క్వి., బార్లీ : 25–30 క్వి., జొన్నలు - 18–22 క్వి., సోయాబీన్ - 15–20 క్వి., వేరుశనగ - 20–22 క్వి., మొక్కజొన్న - 8–10 క్వి. వరకు నూర్పిడి చేసుకోవచ్చు.

**ముఖ్యాంశాలు :**

- 35 హార్స్‌పవర్‌ల ట్రాక్టర్‌కు కూడా అనుసంధానం చేసుకోవచ్చు.
- అనేక పప్పు దినుసులే కాక, సజ్జలు, జొన్నలు, శనగలు, మెంతులు, బార్లీ, జీలకర్ర, మినుములు, ఆవాలు, సోయాబీన్, వేరుశనగ, పెసర, అలసంద మొదలైన ధాన్యాలను నూర్పిడి చేసుకోవచ్చు.
- వేరుశనగ నూర్పిడి చేయగల ఏకైక యంత్రం ఇది.
- ఒక ధాన్యం నుండి మరో ధాన్యం నూర్పిడికి మార్పు చేయటం చాలా తేలిక, తక్కువ సమయం.
- కత్తిరించడం, నూర్పిడి చేయటం వరుసగా జరిగే యంత్రం.
- ఒక్కో పంటను ఒక్కోరకంగా యంత్రానికి అందించవలసి వుంటుంది.
- పంటను బట్టి యంత్రం లోని బ్లోయర్ వేగాన్ని నియంత్రించుకోవచ్చు.
- నూర్పిడి సామర్థ్యం 99.6%, శుభ్రత సామర్థ్యం 99%, ధాన్యం నష్టం 0.25%, గింజలు పక్కలకు ఎగిరి పోవటం 0.36% లతో ఎంతో సమర్థవంతమైన యంత్రం.

**పురస్కారాలు :**

- ఎన్.ఐ.ఎఫ్. 2001 జాతీయ పురస్కారం పొందింది.

**కావాలనుకున్నవారు సంప్రదించండి:**

పల్లెసృజన, ఫోన్ : 040–27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

# నేను - పల్లెసృజన

నాకు బాగా గుర్తు.... మే నెల 19వ తారీఖు, 2007 నేను నా ఆఫీసులో (అప్పటికింగా ఉద్యోగంలో ఉన్నాను) పని చేసుకుంటూ వుంటే రాఘవ రెడ్డి అదే మీ వీర రాఘవ రెడ్డి నా దగ్గరకొచ్చాడు. అతను మా ఆఫీసు తరుపున మేము ప్రచురించే పత్రికకు కూడా ఆయనే హంగులు అద్ది ప్రింటు చేసేవాడు. సార్ ఒక పేజీ వుంది, తెలుగులోకి తర్జుమా చేసి పెట్టగలరా అని అడిగాడు. సరే అని ఒక గంట తంటాలు పడి చేశాను ఆయన టైపు చేసుకున్నాడు. ఆ విషయం అప్పుడు మర్చిపోయాను. పత్రిక ప్రింటై వచ్చినాక చూపించాడు. మీరు చేసిన పేజీ సార్ అని. 'పల్లెసృజన' పత్రిక. ఇదేమిటని వివరాలు అడిగాను. వివరంగా చెప్పటమే కాక, నాకు బ్రిగేడియర్ గణేశం గారితో కలిసే ఏర్పాటు చేశాడు. ఇద్దరూ కలిసి వివరంగా పల్లెసృజన సంస్థ, పత్రిక, వారు చేస్తున్న పనులు వివరంగా చెప్పారు. చాలా మంచిపని కదా అనిపించింది. అప్పటినుంచి అడపా తడపా పల్లెసృజన పత్రికకి నేను సహాయం చేస్తూనే వున్నా, సంవత్సరంన్నర తర్వాత నేను నా ఉద్యోగం నుంచి రిటైరైన తర్వాత కొంత ఎక్కువ సమయం 'పల్లెసృజన'కి కేటాయించటం సాధ్యపడింది.

ఈ క్రమంలోనే దుర్గాప్రసాద్ గారిని కలిశాను. మనకొక బ్యాంకర్ సహాయం వుంటే బాగుండుననే ఉద్దేశ్యంతో నాబార్డ్‌లో పనిచేసే శ్రీకర్‌ని పల్లెసృజనకు పరిచయం చేశాను. ఊరూరా తిరగటం, అనేకమంది గ్రామీణ ఇన్నోవేటర్లని కలవటం, వారితో మాట్లాడటం, వారి జీవిత విశేషాలతో పాటు వారి ఇన్నోవేషన్ వివరాలు పత్రికలో రాయటం, కొన్ని అర్హత కలిగిన ఇన్నోవేషన్‌లను నిర్దిష్ట పద్ధతిలో జాతీయ స్థాయి వరకు తీసుకువెళ్ళి ఎన్ఐఎఫ్‌కి పరిచయం చేసి దేశాధ్యక్షుని చేతుల మీదుగా పురస్కారాలు ఇప్పించటం, వాళ్ళు రాష్ట్రపతి అతిథులుగా వుంటే చూసి సంతోషించటం, మా ఇన్నోవేటర్ చింతకింది పల్లేశంకు2017 'పద్మశ్రీ' పురస్కారం రావటం.... చెప్పుకుంటూ పోతే, రాసుకుంటూ పోతే చాలా ఆనందంగా వుంది.

ఇదంతా బావుంది. ఒక ఇన్నోవేటర్ గురించి కానీ, సాంప్రదాయ జ్ఞానం గురించి కానీయండి రాస్తున్నపుడు ఇది ప్రజలకు ఎంత ఉపయోగమో కదా, ఇది ప్రజల జీవితాలనే మార్చేస్తుంది అన్న ఉత్సాహంతో దానికి తగ్గ ఉద్విగ్నతతో



నేను రాసిన కథనాలు పత్రికలో బాగున్నాయని చెప్పే వాళ్ళే కాని, పురస్కారాలు పొందటం తప్ప, ఆ ఇన్నోవేషన్ కాని, ఆ ఇన్నోవేటర్ కాని నేను ఊహించినంత, కోరుకున్నంత ఉన్నత స్థాయికి వెళ్ళి పెద్ద ఫలితాలు పొందటం లేదన్న బాధ ఎక్కడో ఉంది. కారణం తెలీటం లేదు. అయినా పల్లెసృజన తనపని తాను చేసుకుంటూనే వుంటుంది. గ్రామీణ ఇన్నోవేటర్లని నలుగురికీ పరిచయం చేయటంలో తనవంతు పాత్ర పోషిస్తునే వుంది.

ఒక ఇన్నోవేటర్ ఆర్థికంగా పరిపుష్టి చెందాలి అంటే కేవలం పత్రికల్లో అతని పేరొచ్చినంత మాత్రాన సరిపోదని, పత్రిక ద్వారా అతని గురించి తెలుసుకున్న సమాజం చేయూత అతనికి చాలా కావాలని నాకు తెలిసి వచ్చింది. అది మన ఇన్నోవేటర్లందరికీ అందాలని, అందేవరకు మా ప్రయత్నం చేస్తూనే వుంటామని, మీకు - మాకు మధ్యన గ్రామీణ ఇన్నోవేటర్ల, సాంప్రదాయ జ్ఞానుల కథనాలు 'పల్లెసృజన' పత్రిక మాధ్యమంగా మీదాకా చేరవేయటంలో నాకు ఆనందాన్నిచ్చే ఈపని కొనసాగిస్తూనే వుంటామని మనవి చేస్తూ మా పత్రికను మీరు చదివేసిన తర్వాత మూలన పెట్టేయకుండా, ఇంకొకరికి ఇచ్చి చదివించమని, మీరు కొన్నట్లు వాళ్ళూ ఈ పత్రిక కొంటారేమోనని ఆశిస్తూ .....

మనుషులు కలవటమే కష్టం. అందులోనూ మనసులు కలిసిన మనుషులు కలవటం మరీ కష్టం. మా అదృష్టం మా 'పల్లెసృజన'లో అలాంటి వాళ్ళు బ్రిగేడియర్ పోగుల గణేశం, జాగర్లమూడి దుర్గాప్రసాద్, జమ్మలమడక శ్రీధర్, పల్లె వీరరాఘవ రెడ్డి, ప్రొఫెసర్ ఛుగ్ .... కలిశాం. ఆర్థిక వనరులు లేని సంస్థని, దానితో పాటు ప్రకటనలు లేని పత్రికను నడపటం ఇంకెవరి సంగతి ఎలా వున్నా, మాకు మాత్రమే సాధ్యమైందేమో! పల్లెసృజన పత్రిక 60వ సంచిక ఏ అంతరాయమూ లేకుండా వరుసగా ప్రచురించడమంటే మా పట్టుదల, కృషితో పాటు, మీ ఆదరణ కూడా ఉందనటంలో నాకేం సందేహం లేదు. ఈ పండుగలో మీరూ భాగస్వాములే అందరికీ శుభాకాంక్షలతో.... ఇప్పటికి సెలవు.

– మీ జమ్మలమడక శశిమోహన్

## సివిఆర్ మట్టి స్ప్రే పద్ధతిలో వ్యవసాయం చేసి



# మిరపలో రికార్డు స్థాయి దిగుబడి, రెట్టింపు విలువ సాధించిన యువ రైతు సీతారామయ్య

- పల్లె వీర రాఘవ రెడ్డి

'పల్లెసృజన' మొదటినుండి రసాయన రహిత వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, కలుషితం లేని ఆహారాన్ని సమాజానికి అందించాలనే ప్రయత్నం చేస్తున్న విషయం పాఠకులకు తెలుసు. దేశంలో ఎందరెందరో ఎన్నో రకాల సేంద్రియ, ప్రకృతి, సహజసిద్ధ వ్యవసాయ పద్ధతులను చెప్తూనే వున్నారు. ఈ పద్ధతులలో చింతల వెంకట్‌రెడ్డి (సివిఆర్) మట్టితో చేసే వ్యవసాయ పద్ధతిని ఆచరించి అద్భుతమైన ఫలితాలు సాధించాడు ఖమ్మం జిల్లా, మధిర గ్రామానికి చెందిన 25 సంవత్సరాల యువ రైతు గండ్ల సీతారామయ్య. ఇతను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ, దీనికన్నా మన పొలంలో వ్యవసాయం చేసుకోవటం మేలు అని భావించి, తన ఉద్యోగాన్ని వదులుకుని ప్రకృతి వ్యవసాయం చేయటం ప్రారంభించాడు.

నలుపు, ఎరుపు మిళితమైన మట్టితో కూడిన రంగు గల పొలం కలిగిన సీతారామయ్య 4 ఎకరాల్లో మొదట పెసర వేసి, అది బాగా పెరిగిన తర్వాత 'పచ్చిరొట్ట' ఎరువుగా (గ్రీన్ మెన్యూర్) పొలంలో మిళితమయ్యేలా కలియదున్నాడు. ఆ తర్వాత 'తేజ రకంలో నగ్మా - 405' అనే హైబ్రిడ్ రకం మిరప విత్తనాలను నారు పోసుకుని 60 రోజుల తర్వాత పొలంలో నాటాడు. ముందుగా 'వేస్ట్ డీ-కంపోజర్'ను ఒకటి రెండుసార్లు స్ప్రే చేశాడు. ఆ తర్వాత వారానికి ఒకసారి చొప్పున 'సివిఆర్' గారి 'సబ్ సాయిల్' పద్ధతిలో లోపలి మట్టిని, పైమట్టిని నీటిలో కలిపి వారానికోసారి స్ప్రే చేస్తూ వచ్చాడు.

ప్రస్తుతం పంట 4 అడుగులకు పైగా పెరిగి గ్రామంలోని అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కేవలం మట్టిని పిచికారి చేసిన పంట కావడంతో చింతల వెంకట రెడ్డి వ్యవసాయ పద్ధతిపై నమ్మకమున్న ఢిల్లీకి చెందిన ద్వివేది అనే ప్రముఖ మిర్చి వ్యాపారవేత్తకు సివిఆర్ సీతారామయ్యను పరిచయం చెయ్యటంతో ఇతని పొలం చూసి, ఇది ఆరోగ్యకరమైన పంట, ఎగుమతికి ఎంతో అనువైనదని భావించి, ఇందులో ఎటువంటి రసాయనాలు లేవని స్వయంగా పరీక్షలు చేయించిన తర్వాత ఈ పంటను మార్కెట్ రేటుకు రెట్టింపు ధర క్వింటాలు రూ. 18,000లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నాడు.

సాధారణంగా రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగిస్తున్న పద్ధతుల్లో ఎంతో సారవంతమైన భూమి అయితే ఎకరాకు 25 క్వింటాళ్ళ వరకు మిర్చి దిగుబడి వస్తుంది. సీతారామయ్య సాగుచేసిన సివిఆర్ పద్ధతి వల్ల పంట ఎంతో ఆరోగ్యంగా పెరగటంతో పాటు ఎకరాకు 30 క్వింటాళ్ళ వరకు దిగుబడి తప్పక వస్తుందని అనుభవజ్ఞులు అంటున్నారని యువ రైతు సీతారామయ్య అంటున్నాడు. ఇంకో పదిహేను రోజుల్లో పంట కోతకు వస్తుందని, మార్చి మొదటి వారంలో

మిరప పండు తీస్తామని అంటున్నాడు.

ఎకరాకు తన పెట్టుబడి 10 వేలకు మించలేదని చెప్తున్న సీతారామయ్య ఎటువంటి రసాయన ఎరువులు కాని, పురుగు మందులు కాని ఉపయోగించకుండా అత్యధిక దిగుబడి సాధించటంతో పాటు, రికార్డు స్థాయిలో అంటే ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ఖరీదుకు రెట్టింపు రేటు పొందడం వల్ల ఆ ప్రాంతంలో ఎంతో చర్చనీయాంశంగా మారింది. మంచి దిగుబడి, అద్భుతమైన ఖరీదు సాధించిన సీతారామయ్య ఎంతో మంది యువ రైతులకు ఆదర్శంగా నిలిచాడు.

దీన్నిబట్టి ఇంతవరకు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం చేస్తే దిగుబడి తక్కువ వస్తుందని, ఈ ప్రక్రియ వల్ల రాబోయే రోజుల్లో దిగుబడులు తగ్గి, ఆహార సమస్య తలయెత్తే ప్రమాదముందనే విష ప్రచారం చేస్తున్న కొందరికి ఈ రైతు సరైన పద్ధతులను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయం చేస్తే వ్యవసాయ ఖర్చులు తగ్గి, దిగుబడి పెరగటంతో పాటు, అధిక లాభాలు సాధించవచ్చని నిరూపించాడు సీతారామయ్య.






వ్యవసాయ ఖర్చులను తగ్గించడంలో ఎంతో గొప్పగా పని చేస్తున్న మట్టిని పిచికారి చేసే పద్ధతులను అందించిన మన తెలుగు రైతు చింతల వెంకట రెడ్డి గారు ఈ విధానాన్ని ఇతర దేశాల వారు తమదిగా చెప్పుకోకూడదని లక్షలాది రూపాయలు వెచ్చించి అంతర్జాతీయ పేటెంటును పొందారు. అంతటితో ఆగకుండా ఈ విధానం యావత్ రైతాంగం ఆచరించాలని మట్టిని పిచికారి, ఎరువులుగా అందించే పద్ధతులను రైతాంగానికి ఉచితంగా అందిస్తున్న చింతల వెంకట్ రెడ్డి గారు నిజమైన రైతు బాంధవుడు.

సీతారామయ్య, గత సంచికలో ప్రచురితమైన చెఱకు వ్యవసాయం చేసిన రైతు జగదీష్ లాంటి యువకులు ముందుకు వచ్చి, సహజసిద్ధ వ్యవసాయం చేస్తే మనుష్యులను, పశువులను ఎన్నో రుగ్మతల నుండి కాపాడిన వారుగా మారాలని 'పల్లెసృజన ఆశిస్తోంది. ఇన్నోవేటర్లు కొత్త పుంథాలను మనకు అందిస్తే వాటిని ప్రయోగం చేయడానికి ముందుకు వచ్చిన ఇలాంటి యువ రైతులు మనకు అంతే గొప్ప సేవ చేసిన వారే. ఇలాంటి ధైర్యవంతులు, ఆదర్శ పథంలో నడిచే రైతులకు 'పల్లెసృజన' ఎల్లప్పుడు తోడుంటుంది. నేటి యువత బాగా డబ్బు సంపాదించ గలిగే ఉద్యోగాలను సైతం వదులుకుని, వ్యవసాయంలో కూడా ఉద్యోగాలకన్నా మంచి సంపాదనతో పాటు, ఆత్మ తృప్తి ఎక్కువగా వుంటుందని నమ్మి, ప్రయోగాత్మక వ్యవసాయం వైపు అడుగులు వేయటం చూస్తుంటే సమీప భవిష్యత్తులోనే వ్యవసాయ రంగం కొత్తపుంతలు తొక్కి, "మనది వ్యవసాయ దేశం" అని సగర్వంగా చెప్పుకునే స్థాయికి చేరుస్తుందని విశ్వసిద్దాం.

**సీతారామయ్య ఫోన్ : 96663 71211,**

**చింతల వెంకట్‌రెడ్డి ఫోన్ : 9866 88 3336**

# 'పల్లెసృజన' స్వప్నం



'పల్లెసృజన' ఎడిటర్ శశిమోహన్ నాకు తమ్ముడు వరస. ఒకరోజు అతనితో మాట్లాడుతూ కూర్చున్నపుడు 'పల్లెసృజన' పత్రిక చూశాను. పేరు చాలా ప్రత్యేకంగా అనిపించింది. చదవటం మొదలు పెట్టాను. అందులో 'శ్రీశైలం' గురించి వ్రాయబడి వుంది. నిజంగా ఈ శైలం అంత గొప్పదా? వాడి చూడాలనిపించింది. నాకో బాటిల్ తెమ్మని అడిగాను శశిమోహన్ని. అప్పటికి ఆ కథ అయిపోయింది.

నేను అప్పటికింకా నాబార్డ్‌లో ఉద్యోగం చేస్తున్నాను. కొంత కాలానికి అంటే 2009 డిసెంబర్ 31న పదవీ విరమణ చేశాక, నాకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. ఎందుకో, ఇక చాలు, ఏదైనా మనసుకు నచ్చిన పని చేయాలని అనుకున్నాను. ఆలోచిస్తూ కొన్ని నెలలు గడిపాను. అది మార్చి, 2010. శశిమోహన్‌తో కలిసి నాడు చిక్కడపల్లిలోని 'పల్లెసృజన' కార్యాలయానికి వెళ్ళాను. ఆరోజు బ్రిగేడియర్ గణేశం గారు రాలేదు. టెలిఫోన్ ద్వారా దుర్గాప్రసాద్‌తో పరిచయం అయ్యింది. మరునాడు కలుసుకుందామని అనుకున్నాం. అలాగే కలిశాం. అరగంట అనుకున్నాం కానీ, 3 గంటల పాటు అలా మాట్లాడుకుంటూ గడిపాం. పల్లెసృజన చేస్తున్న కార్యక్రమాలు నాకు ఎంతగానో నచ్చాయి. నా సమయాన్ని ఇక పల్లెసృజనకే కేటాయించాలని అనుకున్నాను. ఆ సమయంలో విదేశాలకు వెళ్ళే కార్యక్రమం ఉండింది. తిరిగి 2010 ఆగస్టులో రాగానే 'పల్లెసృజన'తో ఏర్పడిన ప్రత్యక్ష బంధం నాటినుంచి నేటిదాకా దినదిన ప్రవర్ధమానంగా పెరుగుతూ వస్తోంది.




మొదటిసారి 2011లో 'పల్లెసృజన' వార్షిక సమావేశంలో పాల్గొన్నాను. ఎంతో అబ్బురపడిపోయాను మన అట్టడుగు ఆవిష్కరణల తెలివికి. నాకు వెంటనే అనిపించింది. అప్పటి నాబార్డ్ జనరల్ మేనేజర్ 'మోహనయ్య' గారితో ఫోన్లో మాట్లాడాను. వారు మమ్మల్ని కలవడానికి ఒకరోజు కేటాయించారు. ఆ కలయిక ఒక కొత్త ఆవిష్కరణకు దారి తీసింది. అందుకు ఆర్థిక సహాయం నాబార్డ్ అందించింది. రెట్టింపు ఉత్సాహంతో ముందుకు వెళ్ళాం.

కొంత కాలానికి మాకు ఒక క్రొత్త సమస్య ఎదురైంది. ఈ ఆవిష్కరణలకు ఆర్థిక సహాయం కావాలని. బ్యాంకుల వారికి వీళ్ళమీద పెద్దగా నమ్మకం లేదు. వారినుండి సాయం రాకపోవడం తో 2016లో మనమే ఒక 'ట్రస్ట్' ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తే బావుంటుందని, అనుకుని నేను, శశిమోహన్ ఏప్రిల్, 2016లో 'పల్లెసృజన ఇన్నోవేషన్ ఫండ్' పేరుతో ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి దానిని రిజిష్టర్ చేశాము. ఈ ట్రస్టు ద్వారా ఇప్పటి వరకు ఆరుమంది ఆవిష్కర్తలకు ఆర్థిక సహాయం అందించాం. ఇంకా ఎంతో చేయవలసి వుంది. చేద్దామనే కోరికా ఉంది. ఆ భగవంతుడు మాకు ఆ శక్తిని ప్రసాదించాలని కోరుకుం టున్నాము.

చివరగా మా స్వప్నం ఏమిటంటే, ప్రతి ఆవిష్కర్త తన ఆవిష్కరణను మార్కెట్‌లో అమ్మగలగాలి, తద్వారా తాను ఆర్థికంగా పరిపుష్టి చెందాలి, అతను ఇతర ఆవిష్కర్తలు చేసిన వస్తువులను కూడా అమ్మాలి, అలా ఈ ఉద్యమం ముందుకు సాగాలి. అందుకై వనరులు సమకూరాలి, మా శ్రమ ఫలించాలి. 60వ సంచిక విడుదల సందర్భంగా ఇన్నోవేటర్లకు, పాఠకులకు శుభాకాంక్షలతో....

మీ **జమ్మలమడక శ్రీకర్**

# పల్లెసృజన 60వ సంచిక - మధుర స్మృతి



తెలుగులో గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానాన్ని పంచే 'పల్లెసృజన' ద్వైమాసిక పత్రికతో నేను కలిసి వుండటం నా అదృష్టంగా భావిస్తున్నాను. పల్లెసృజన సంస్థ, పత్రిక, దాని నిర్వాహకుల నుండి ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి నేర్చుకోవాల్సింది ఉంది. నాకు తెలిసినంత వరకు ఎవ్వరూ చెయ్యని పనిని ఒక ప్రత్యేకమైన రీతిలో వీరు చేస్తున్నారు.

శోధయాత్రలలో చిన్న, పెద్ద మూడు రోజుల పాటు ఎండని, వానని, చలిని లెక్క చేయకుండా 45 నుండి 55 కిలోమీటర్లు కాలి నడకన కుగ్రామాలలో తిరగటం అన్నది చాలా ప్రత్యేకమైన అనుభవం. ఈవిధంగా సుమారు 150 మంది గ్రామస్థాయి ఇన్నోవేటర్లను గుర్తించి, ప్రపంచానికి పరిచయం చేయడం జరిగింది. ఇది అనితర సాధ్యమైన పని. పదో తరగతి కూడా పాసు కాలేని ఇన్నోవేటర్లు పేటెంట్లు సంపాదించ గలిగారు. కొందరికి విదేశాల నుంచి కూడా సహాయం లభించింది. కొందరి దీక్ష, పట్టుదల కల వ్యక్తులు వారి సమయాన్ని, శ్రమను పల్లెసృజన పత్రికకి, సంస్థకి వినియోగించడం వలన ఇవన్నీ సాధ్యమయ్యాయి. వీరందరిని ముందుండి నడిపించిన వ్యక్తి రిటైర్డ్ బ్రిగేడియర్ పి. గణేశం. ఈయన ఆర్మీలో ఉండగా ఈ విభాగానికి మొదటి ఇన్నోవేషన్ చేశాడు. మన సాంప్రదాయ జ్ఞానాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఇన్నోవేటర్లకి సమాజంలో ఉచిత స్థానాన్నిచ్చి వారు యువతను ప్రోత్సహించే విధంగా ఏర్పాటు చేయాలి.

ఇప్పుడు కొన్ని లక్షల మంది గ్రామీణ ఇన్నోవేషన్లను గురించి, సాంప్రదాయ జ్ఞానం గురించి తెలుసుకొని మాట్లాడు తున్నారు అంటే అది 'పల్లె సృజన' ప్రభావమేనని నేను గట్టిగా నమ్ముతున్నాను.

ఎన్ని ఇన్నోవేషన్లు చేస్తే అంత త్వరగా ఆ దేశం ముందుకు వెళుతుందని గ్రహించాలి. ఇప్పుడు చేస్తున్న కృషి తక్కువేమో అనిపిస్తుంది. నాకు తెలిసిన ఒక కలేజి ప్రొఫెసర్ పేటెంట్‌కి దరఖాస్తు చేసుకుంటే, అది రావటానికి 7 సంవత్సరాలు పట్టింది. ఈ పరిస్థితి మారాలి.

నాకు అప్పుడప్పుడూ అనిపిస్తూ వుంటుంది.... మనం 'అకల్' (మెరిట్)ని గుర్తించక 'నకల్' (కాపీ)ని ప్రోత్సహిస్తున్నామేమోనని. ఈ విషయంపై అనవసరపు చర్చలకు తావివ్వకుండా, ఇంటర్‌నెట్, వెబ్‌ల సహాయంతో ఒక పరిష్కార మార్గం కనుగొనాలి. గ్రామీణ ఇన్నోవేటర్ దగ్గరి నుండి మనం ప్రేరణ, స్ఫూర్తి పొందుదాం. ఆలేరు గ్రామానికి చెందిన 'పద్మశ్రీ' చింతకింది మల్లేశం ని చూసి యువత ప్రేరణ పొందాలి. గణేశం గారి అడుగు జాడల్లో నడుస్తూ మనమింకా చలా దూరం ప్రయాణం చేయవలసి ఉంది. 'పల్లెసృజన' సభ్యులకు నా శుభాకాంక్షలు.....

మీ పైడిమర్రి చంద్రకాంత్ శర్మ

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



మల్లేష్ పెడల్ పంపు




రోషన్‌లాల్ విశ్వకర్మ చెరుకు కణుపులను కత్తిరించే సాధనం



కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు



గోపాల్ భీసే సైకిల్ నాగలి





మల్లేష్ సోలార్ స్ప్రేయర్, రైతు ఫ్యాన్ల రిమోట్

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
67, రోడ్ నెం. 2, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.

# సాత్విక్ - 2017




అహమ్మదాబాద్‌లో 23-25 డిసెంబర్, 2017న జరిగిన 'సాత్విక్-2017) కార్యక్రమంలో మొదటిసారి జాతీయ స్థాయిలో బండారి రమేష్ (విత్తనాల రమేష్) తన విత్తనాలను ప్రదర్శించే అవకాశం కలిగింది. ఈ అవకాశాన్ని 'పల్లెసృజన' కల్పించటం తనకెంతో సంతోషంగా ఉందని అంటున్నాడు.

రమేష్ తన మిత్రుడు శ్రీనివాస్ సహాయంతో తాను సేకరించిన విత్తనాలతో అహమ్మదాబాద్ చేరుకున్నాడు. అక్కడ 'సృష్టి' సంస్థ వీరికి కావలసిన వసతి ఏర్పాటు చేసింది. తాను మొదటిసారిగా ఉత్తర భారత దేశపు ప్రజలతో మూడు రోజుల పాటు గడపటంతో కొత్త అనుభూతికి లోనయ్యానంటున్నాడు. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల నుండి వచ్చిన ఇన్నోవేటర్లు తాము రూపొందించిన సాంప్రదాయ వంటకాలను అక్కడ వండి విక్రయించారు. ఎన్ఐఎఫ్‌కు చెందిన ప్రొఫెసర్ అనిల్ గుప్త, రమేష్ భాయ్ పటేల్ తదితరుల ప్రారంభోపన్యాసంతో కార్యక్రమం ప్రారంభమైంది.

అక్కడి ప్రదర్శన శాలలోని దాదాపు అన్ని స్టాల్లు తమతమ ఉత్పత్తులను ప్రదర్శించటంతో పాటు, వాటిని అమ్మకానికి కూడా ఏర్పాటు చేసినవే కాని ఒక్క పల్లెసృజన స్టాల్ (రమేష్ స్టాల్) మాత్రం కేవలం ప్రదర్శన కొరకే కేటాయించటం వల్ల తనకి ఒక కొత్త అనుభవమన్నాడు రమేష్. ఈ విత్తనాలు అమ్మకాని కాదు, కేవలం ప్రదర్శనకే అనటంతో కొందరు ఆశ్చర్యపోగా, మరి కొందరు అమ్మకానికి కూడా ఏర్పాటు చేసివుంటే బావుండేదని అన్నారు. బ్రిగేడియర్ గణేశం గారు రమేష్ ప్రదర్శిస్తున్న విత్తనాలను గురించి అనిల్ గుప్త తదితర అతిథులకు వివరించగా, వారు ఇతన్ని ఎంతగానో అభినందించి, ప్రోత్సహించడంతో పాటు ఎన్నో సలహాలు, సూచనలు కూడా చేశారన్నాడు. ఈ సలహాలన్నీ భవిష్యత్తులో ఏర్పాటు చేసే ప్రదర్శనలలో పాటించటానికి ఎంతగానో ఉపయోగ పడతాయన్నాడు.

ఈ ప్రదర్శనలో పాల్గొనటం వల్ల దేశంలోని ఎంతో మంది ప్రఖ్యాతులైన పర్యావరణ వేత్తలతో పరిచయం కావటం తన భాగ్యమని అన్నాడు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ దృష్టిలో 'పల్లెసృజన'కు ఒక ప్రత్యేక స్థానం ఉందని గ్రహించానని, తనకీ అవకాశాన్ని ఇచ్చిన 'పల్లెసృజన'కు కృతజ్ఞతలు తెలియజేశాడు రమేష్.

# జనవరి - ఫిబ్రవరి-2018 మాసాల్లో 'పల్లెసృజన' పాల్గొన్న ప్రదర్శనలు









## వరంగల్ లో 'సైన్స్ ఎక్స్‌పో'

డిశంబర్ 2017, 21-22 తేదీలలో జరిగిన మేడికొండ సైన్స్ ఎగ్జిబిజన్‌లో 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను ప్రదర్శించే అవకాశం డల్పించారు నిర్వాహకులు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఎగ్జిబిషన్‌లో దాదాపు వెయ్యి మందికి పైగా విద్యార్థులు, 20 మంది జిల్లా స్థాయి అధికారులు, 300 మందికి పైగా ఉపాధ్యాయులు పల్లెసృజన స్టాల్‌ను సందర్శించారు.

'పల్లెసృజన' తరఫున కార్యక్రమ నిర్వాహకుడు సుభాష్‌కు ప్రదర్శన ముగింపు ఉత్సవంలో ప్రసంగించే అవకాశం కల్పించారు. సుభాష్ ప్రసంగంలో పల్లెసృజన చేపడుతున్న, చేస్తున్న కార్యక్రమాలు, ఇన్నోవేషన్ల విస్తృతి కేంద్రం, ఇగ్నైట్ పోటీలలో పాఠశాల విద్యార్థుల ఆలోచనలకు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, పల్లెసృజన సంయుక్తంగా కల్పిస్తున్న అవకాశాలను గురించి క్షుణ్ణంగా వివరించడం జరిగింది.

సుభాష్ వివరణకు స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారి, ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులకు ఈ పోటీలలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఏమీ చదువుకోని గ్రామీణుల ఇన్నోవేషన్లు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సందర్శించిన రైతుసోదరులు ఎంతోమంది పల్లెసృజన ఇన్నోవేషన్లు రైతు సమాజానికి ఎంతగానో తోడ్పడేవిగా ఉన్నాయని ప్రశంసించారు. 'పల్లెసృజన' ఇన్నోవేషన్ల ప్రదర్శన పట్ల నిర్వాహకులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

## దేశీ విత్తనోత్సవం - 2018

హైదరాబాద్ లోని రామకృష్ణ మఠం ప్రాంగణంలో 'సేవ్' సంస్థ ఏర్పాటు చేసిన 'దేశీ విత్తనోత్సవం-2018' ఘనంగా నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో 'పల్లెసృజన' పాల్గొనే అవకాశాన్ని కల్పించారు 'సేవ్' సంస్థ నిర్వాహకులు. ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు 'పల్లెసృజన'కు తప్పక అవకాశం కల్పించాలని మాజీ నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ మోహనయ్య గారు పట్టుబట్టి మరీ అవకాశం కల్పించటం వల్ల మన సంస్థ మారుమూల స్థాయి వారికే కాదు, నూతనంగా వ్యవసాయంలో అడుగు పెడుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఉన్నతోద్యోగులు, మహిళలు, ఆదర్శ రైతుల మదిలో సమున్నత స్థానాన్ని సంపాదించుకుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

'పల్లెసృజన' కలలు గంటున్న గ్రామీణ వికాసం కొరకు యువత ముందుకు రావాలి, వ్యవసాయం లాభాలతో కూడుకున్న వ్యవస్థ అని సమాజానికి తెలియజేయాలన్న సంకల్పం నెరవేరే రోజు ఎంతోదూరం లేదనిపించింది.

కార్యక్రమంలో రెండవ రోజు పల్లెసృజన అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం గారి ప్రసంగాన్ని వినటానికి హాలు క్రిక్కిరిసి పోయిందంటే 'పల్లెసృజన' చేస్తున్న కార్యక్రమాలు సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తున్నాయో అర్థమవుతుంది. బ్రిగేడియర్ గారి ప్రసంగం ముగిసిన వెంటనే 'పల్లెసృజన' స్టాల్ సందర్శకులతో నిండిపోవటమే ఇందుకు నిదర్శనం. ప్రారంభం నుంచి ఇంతవరకు ఎన్నడూ లేని విధంగా పత్రిక చందాదారులు అడిగి మరీ చేరటం, ఇన్నోవేషన్లను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవటం, ఇన్నోవేటర్ల ఫోన్ నెంబర్లు, పల్లెసృజన కార్యలయం ఫోన్ నెంబర్లు సేకరించిన విధానం నిర్వాహకులకు ఎంతో ఆనందాన్నిచ్చింది.

ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, చదువుకున్న యువ రైతులు, గ్రామీణ రైతాంగంతో సహా మహిళలు కూడా పల్లెసృజన కార్యక్రమాలను చూసి ముగ్ధులయ్యారు.

"ఈ ఇన్నోవేషన్లు మాకు చాలా అవసరం ఎక్కడ లభిస్తాయి, మేము ఏ షోరూంలలో చూడవచ్చు?" అని అడిగిన కొందరి ప్రశ్నలకు కార్యక్రమంలో పాల్గొన్న పల్లెసృజన ప్రతినిధి రాఘవరెడ్డి ఎంతో అనునయంతో "ఈ ఇన్నోవేషన్లన్నీ వ్యాపార సంస్థలు చేసేవి కావు, రైతుల కొరకు రైతులు తయారు చేసినవి, వారిది వ్యాపార దృష్టి కాదు, వీడియోలు చూసి మీకు నచ్చితే తీసుకోండి, లేదా ఇన్నోవేటర్ల ఫోన్ నెంబరు ఇస్తాం మీరు నేరుగా వెళ్ళి సందర్శించి తీసుకోండి, అంతేగానీ వీటిని అమ్మటానికి దళారీ వ్యవస్థలేవీ లేవు, కేవలం పల్లెసృజన స్వచ్ఛందంగా తయారీదారుని నుండి వినియోగ దారునికి చేర్చటానికి పాటుపడుతున్న సంస్థ" అని వివరించటంతో విన్న ప్రతి ఒక్కరూ పల్లెసృజన కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించడం ఎంతో ఆనందదాయకం.

## అగ్రిటెక్ సౌత్-2018

హైదరాబాద్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'సిఐఐ' సంస్థ ఏర్పాటు చేసిన "అగ్రిటెక్ సౌత్-2018" ప్రదర్శనలో దక్షిణాది రాష్ట్రాల రైతాంగం, వ్యవసాయ పనిముట్ల తయారీదారులు ఎంతోమంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'పల్లెసృజన'కు స్టాల్ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుని అవకాశం కల్పించారు వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సెలర్ డా. ప్రవీణ్ రావు గారు.

ప్రదర్శనను తిలకించిన వివిధ శాఖల అధికారులతో పాటు, దక్షిణాది రాష్ట్రాల రైతాంగం 'పల్లెసృజన' కార్యక్రమాలను నిశితంగా పరిశీలించి, కితాబునిచ్చారు. ముఖ్యంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులు తయారు చేసే సంస్థల ప్రతినిధులు 'పల్లెసృజన' ఇన్నోవేటర్ల సృజనాత్మకతను చూసి ఇంజనీర్లకు కూడా రాని ఆలోచనలు సాధారణ వ్యక్తులకు ఎలా వచ్చాయా! అని ఆశ్చర్యానికి లోనయ్యారు.

ప్రదర్శనలో ముఖ్యంగా సైదాచారి బుల్లి ట్రాక్టర్ చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో మహిపాల్, బాలయ్య, ముల్లపూడి సత్యనారాయణలు తయారు చేసిన వీడర్లు చూపరులను ఆకట్టుకున్నాయి. 'పల్లెసృజన' పత్రికను ప్రశంసిస్తూ ఎంతోమంది చందాదారులుగా చేరటం గమనార్హం. గల్లా చంద్రశేఖర్ తయారు చేసిన 'శ్రీశైలం' ఎంతోమంది కొనుగోలు చేయటంతో పాటు అతని కృషికి జేజేలు పలికారు.

# 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు




- 'ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో...

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## అన్ని ప్రాంతాలలో పండే 'ఆపిల్' రకం

**జాతీయ ద్వితీయ బహుమతి :** పంట మొక్కలు

**పంట :** ఉష్ణ, సమశీతోష్ణ మండలాల్లో పండే హెచ్ఆర్ఎంఎన్ –99 యాపిల్ రకం

**ఇన్నోవేటర్ :** హరీమాన్ శర్మ, బిలాస్‌పూర్, హిమాచల్ ప్రదేశ్.



హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన 60 సంవత్సరాల హరీమాన్ శర్మ ఆ ప్రాంతంలో పేరెన్నికగన్న అభ్యుదయ రైతు. సాధారణంగా యాపిల్ పండ్లు కొండ వాలు ప్రాంతాల్లో వాతావరణం చల్లగా వున్న ప్రాంతాల్లోనే పండుతాయన్న ఒక అపోహ ప్రచారంలో ఉండేది. కానీ ఇతను సమతల ప్రాంతాల్లో, వాతావరణం వేసవిలో 40 నుండి 45 డిగ్రీల వేడి వున్న ప్రదేశాల్లో కూడా పండించటానికి అనుకూలమైన యాపిల్ రకాన్ని అభివృద్ధి చేశాడు. వీటికి పూత వచ్చే సమయంలో కూడా చల్లని వాతావరణం అవసరం లేదు.

హరీమాన్ శర్మకు 3 సంవత్సరాల వయసులోనే తల్లి చనిపోవటంతో మేనమామ దత్తత తీసుకుని పెంచాడు. 10వ తరగతి వరకు చదువుకున్న ఇతను ఆ తర్వాత మేనమామకు వ్యవసాయంలో సహాయకారిగా ఉండేవాడు. ఇప్పుడీయన భార్య, పిల్లలు, మనవలతో పెద్ద కొడుకు దగ్గర ఉంటున్నాడు. ఇద్దరు కుమార్తెలకి పెళ్ళిల్లయిపోయాయి. హరీమాన్ తనకున్న 1.75 హెక్టార్ల పొలంలో వ్యవసాయం చేస్తున్నా, ముఖ్యంగా పళ్ళతోటలంటే ప్రత్యేకమైన అభిమానం. అందుకే తన పొలంలో యాపిల్, మామిడి, దానిమ్మ, నేరేడు, కివీ, ప్లం, పీచ్ లాంటి పండ్లతో పాటు, కొద్దిగా కాఫీ కూడా పండిస్తూ వుంటాడు. ఒకే పొలంలో యాపిల్, మామిడిలను పక్క పక్కనే పండిస్తాడు. తనవద్ద మొక్కలు సేకరించి తమ పొలంలో నాటుకుని పండించే రైతులంటే ఇతనికి ఎంతో ఇష్టం.

తాను ఒకసారి యాపిల్ పండు తిని దాని విత్తనాలను భూమిపైన పారవేయగా కొద్ది రోజుల్లో అవి మొలకెత్తాయి. సమతల ప్రాంతాల్లో కూడా యాపిల్ చెట్లు మొలకెత్తాయేమిటని ఆశ్చర్యంతో వాటిని శ్రద్ధగా పెంచి, రక రకాల చెట్లతో అంటు కట్టి ప్రయోగాలు చేశాడు. చివరికి సిమ్లా నుంచి తెప్పించిన ఒక యాపిల్ చెట్టుకి అంటు కట్టి, ఒక చిన్న యాపిల్ తోటను

ఏర్పాటు చేసుకున్నాడు.

సాధారణంగా యాపిల్ చెట్లు సముద్ర మట్టానికి 5 వేల నుండి 8,500 అడుగుల ఎత్తైన చల్లని ప్రాంతాల్లో మాత్రమే పండే ఈ పంట కేవలం సముద్ర మట్టానికి 1,800 అడుగుల ఎత్తైన ప్రాతంలో ఏమాత్రం చలి అవసరం లేకుండా పండటం ఈ రకం యాపిల్ ప్రత్యేకత.

సాధారణంగా యాపిల్ చెట్లను చీడపీడలేవీ ఈ రకానికి సోకక పోవడం, వాతావరణం ఎంత వేడిగా వున్నా, పూత పూసి, పళ్ళు కాయడం, చెట్టు ఎత్తు 12 నుండి 15 అడుగులు మాత్రమే ఉండటం ఈయన అభివృద్ధి చేసిన రకం యాపిల్ ప్రత్యేక లక్షణం. సాధారణంగా జనవరి మాసంలో పూతకు వచ్చి, ఆరు నెలల తర్వాత జూన్‌లో కాయలు తెంపుకోవచ్చు. నవంబరు చివరలో లేదా డిసెంబర్ మొదట్లో మొక్కలకు ప్రూనింగ్ చేయవలసి వుంటుంది. సాధారణ సైజులో వుండే ఈ పండ్లు పసుపు ఎరుపుల కలయికతో కూడిన రంగులో తియ్యగా వుంటాయి. మొక్క నాటిన మూడవ సంవత్సరం నుండే కాపుకు వస్తుంది. పది నుండి 12 సంవత్సరాల వయసున్న ఒక చెట్టు నుండి దాదాపు ఒక క్వింటాలు పండ్ల దిగుబడి వస్తుంది. గది వాతావరణంలో ఈ పండ్లు 12 రోజులకన్నా ఎక్కువ నిలువ ఉండవు. ఈ నిలువ సామర్థ్యం పెంచడానికి శర్మ ప్రయోగాలు చేస్తున్నాడు.

ఈ హెచ్ఆర్ఎంఎన్-99 యాపిల్ రకం గురించి తెలుసుకున్న ఎన్ఐఎఫ్ 2014-15 సంవత్సరం నుండి 7000 కు పైగా మొక్కలను దేశంలోని 7 రాష్ట్రాలు, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్ లలో నాటించి, ప్రత్యేకమైన ప్రయోగాలు చేసి,





ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారి ద్వారా ఇతర చలి లేని ప్రాంతాలలో కూడా పండే యాపిల్ రకాలైన 'అన్నా', 'డోర్‌సెట్ గోల్డెన్'లకన్నా ఇది మేలైన రకం అని నిర్ధారించింది. మూడు సంవత్సరాల కోసం ప్రయోగాలు చేయాలని కోరగా, కొన్ని ప్రాంతాలలో ఒక సంవత్సరం తర్వాతనే పూత పూసి, పండ్లు రావటం ఆశ్చర్యానికి గురి చేసింది. ఇతని పేరున పిపివి & ఎఫ్.ఆర్. చట్టం-2001ప్రకారం ఈ ఆపిల్ రకం రిజిష్టరు చేయించింది.

బిలాస్‌పూర్ యాపిల్ మనిషిగా గుర్తింపబడిన హరీమాన్ శర్మ అనేక ప్రాంతీయ, రాష్ట్రీయ, జాతీయ స్థాయిలలో సత్కారింపబడ్డారు. ●


## డిస్ట్రిబ్యూటర్లు కావలెను

పాఠకుల కోరిక మేరకు 'పల్లెసృజన' పత్రికను కేవం చందా దారులకే కాకుండా రిటైల్ మార్కెట్‌లో కూడా విక్రయించాలనుకుంటున్నాము. కావున మీ ఇంట్లోనే వుండి మీ జిల్లా/ మండలం/ సమీప పట్టణంలో గల పత్రికలు అమ్మే షాపు ద్వారా ఈ పుస్తకం విక్రయించటానికి ఆసక్తి గల వారు వెంటనే సంప్రదించండి. - ఎడిటర్

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు


వీర రాఘవ రెడ్డి

**81257 99904/ 7989038186**

లేదా ఇ-మెయిల్ : narendragrafixhyd@gmail.com

ద్వారా సంప్రదించవచ్చు.

# వేరుశనగ నూర్పిడి యంత్రం



- 'ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**రాష్ట్ర స్థాయి బహుమతి :** వ్యవసాయ పరికరం

**పరికరం :** వేరుశనగ త్రవ్వి తీసే యంత్రం మరియు డిస్క హారో సీడ్ డ్రిల్ పరికరం.

**ఇన్నోవేటర్ :**మన్నారాం సుతార్ & మానారాం సుతార్, చురూ జిల్లా, రాజస్థాన్.



రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన 54 సంవత్సరాల మన్నారాం సుతార్ మరియు 63 సంవత్సరాల మానారాం సుతార్‌లు అన్నాతమ్ముళ్ళు. వీరు వ్యవసాయంతో పాటు, వ్యవసాయ యంత్రాల రిపేరి పనులు కూడా చేస్తూ వుంటారు. ఈ క్రమంలో ఆర్జించిన జ్ఞానంతో వీరు వేరుశనగను త్రవ్వి తీసే యంత్రంతో పాటు, వేరుశనగ విత్తనాలు నాటడానికి డిస్క్ హారో సీడ్ డ్రిల్ పరికరాలను తయారు చేశారు.

ఈ ఇద్దరు సోదరులు తమ మిగతా ఇద్దరు సోదరులు మరియు వారి కుటుంబాలతో కలిసి మొత్తం వీరిది 40 మందితో కూడిన సమైక్య కుటుంబం. మన్నారాం 7వ తరగతి వరకు చదువుకున్నా, మాలారాం మాత్రం ఏమీ చదువుకోలేదు. వీరి కుటుంబం వడ్రంగి పనితో పాటు వ్యవసాయం చేస్తూ వుంటారు. తమకున్న 75 బీగాల భూమిలో వ్యవసాయం చేస్తూనే బోరు బావుల పనిముట్లను రిపేరు చేయడంతో పాటు తోటి వ్యవసాయదారులకు కావలసిన వ్యవసాయ పనిముట్లు తయారు చేసి ఇస్తూ వుంటారు.

1995 ప్రాంతంలో ఆ ప్రాంత రైతులు తమ పొలాలలో వేరుశనగ త్రవ్వి తీయటానికి కొత్తరకం బ్లేడు లాంటి పరికరాలతో వేరుశనగ త్రవ్వి తీయటం చేసేవారు. కానీ ఈ పద్ధతిలో చాలా భాగం వేరుశనగ కాయలు భూమిలోనే వుండిపోవటం వల్ల రైతుకు నష్టం జరిగుతుందని వీరు గమనించారు. అప్పుడే ఈ ప్రక్రియ కొరకు ఒక పరికరం తయారు చేస్తే బావుంటుందని ఆలోచించారు. ఎంతో శ్రమించి కిర్లోస్కర్ ఇంజన్‌తో పనిచేసే ఒక పరికరం తయారు చేశారు. దీనిని లాగడానికి ఒక ట్రాక్టరును అద్దెకు తీసుకున్నారు. కొంతవరకు పని చేసినా, ఎక్కువ మన్ను పేరుకు పోవటం వారికి సంతృప్తినివ్వలేదు. నేరుగా ట్రాక్టరుకే అనుసంధానం చేసేలా మరో పరికరాన్ని తయారు చేశారు. ఆ తర్వాత తమ ప్రయోగాల కొరకు ఒక ట్రాక్టరును కొనుగోలు చేశారు. ఇలా ప్రయోగాలు చేస్తూ, వాటిలోని లోపాలను సరిదిద్దుకుంటూ 2012లో సంతృప్తికర పరికరాన్ని రూపొందించారు. ఒక

దశలో వీరు రూపొందించిన పరికరం బాగా పని చేస్తోంది అనుకున్న తరుణంలో ఇలాంటి పరికరాన్ని లాండు మరియు బకనీర్ ప్రాంతాల్లోని ఉత్పత్తిదారులు నకలు తయారు చేసి వీరికన్నా ముందుగా మార్కెట్లో అమ్మటం ప్రారంభించారు. హతాశులైన వీరు దానికన్నా తక్కువ ఇంధనంతో, మరింత సమర్థవంతంగా పని చేసేలా పరికరాన్ని రూపొందిస్తూ, 2012 నాటికి సరికొత్త పరికరాన్ని రైతాంగానికి అందించారు.

ఈ పరికరం దాదాపు ఒకటిన్నర మీటర్ల వెడల్పులో, నాలుగు అంగుళాల లోతు వరకు త్రవ్వుతూ రెండు గంటల్లో ఒక బీగా పొలంలో వేరుశనగను త్రవ్వి తీయగలదు. సాధారణంగా బీగాకు 700 కిలోల వేరుశనగ పంట దిగుబడి వస్తుంది. దీనికి గంటకు రెండున్నర లీటర్ల డీజిలు ఖర్చయ్యే ఈ పరికరం 550 కిలోల బరువుంటుంది. దీన్ని కనీసం 35 హార్స్‌పవర్ల ట్రాక్టర్‌కు అనుసంధానం చేయవలసి వుంటుంది.

అప్పటి వరకు అందుబాటులో వున్న వేరుశనగ విత్తనాలు వేసే పరికరం నిర్ణీత దూరంలో త్రవ్వి విత్తనాలను వేసేది కానీ, విత్తనం భూమిలో పడిన తర్వాత వాటిపై మట్టిని కప్పేది కాదు. కలుపు సమస్య ఎక్కువగా వున్న పొలాల్లో ఈ పద్ధతి అంతగా ఉపయోగ పడేది కాదు. ఈ సమస్యకు పరిష్కారంగా ఈ ఇద్దరు సోదరులు పొలంలో నేరుగా త్రవ్వుకుంటూ, విత్తనం వేసి, ఆ విత్తనాలపై మట్టిని కప్పుతూ వెళ్ళే విధంగా పరికరాన్ని తయారు చేశారు. ఇలా నేరుగా త్రవ్వటానికి వారు డిస్క్‌లను తయారు చేశాడు. ఈ పరికరంలో 11 డిస్క్‌లు (చక్రాల్లాంటివి) (కొన్ని ప్రాంతాల్లో ఈ పరికరాన్ని 'పట్లర్' అంటారు) ఉంటాయి. వీటిమధ్య 20 సెం.మీ. దూరం వుంటుంది. విత్తనం వేసే దూరాన్ని సవరించుకోవచ్చు. మొత్తం 11 చక్రాలు కలిపి 6 అడుగుల వెడల్పులో వుంటాయి. 4 అంగుళాల లోతులో విత్తనం వేసి, వాటిని మట్టితో కప్పేస్తుంది. గంటకు 2 బీగాల భూమిలో విత్తనం వేసుకోవచ్చు. ఇందుకు 2 లీటర్ల డీజిల్ మాత్రమే ఖర్చవుతుంది. దీనిని కూడా కనీసం 35 హార్స్‌పవర్ల ట్రాక్టరుకు అనుసంధానం చేయాల్సి వుంటుంది.

**కావాలనుకున్నవారు సంప్రదించండి:**

పల్లెసృజన, ఫోన్: 040-27111959,
సెల్: 96528 01700 (సుభాష్ చందర్)


అంతర సేద్యాలకు అత్యంత అనువైన వ్యవసాయ పరికరం

మహిపాల్ కల్టివేటర్

Supported by
పల్లెసృజన
PALLE SRUJANA
Supporting Low Cost Solutions in Livelihood Sector
A Knowledge Based VO
www.pallesrujana.org

ఎంతోమంది రైతులు
ఆనందంగా పని చేసుకుంటున్న,
సన్న, చిన్నకారు రైతులకు ఎంతో అనువైనది



కావలసిన వారు వెంటనే సంప్రదించండి

K. Mahipal Chari
President of India Awardee (2015)

VARUN ENGINEERING WORKS
Mfrs. of Mini Cultivators
Peddarajipeta, Parkal (M), Warangal (Dt.) - 506164
Ph. 9866922168



# స్ప్రేయర్ల సుభాని సరికొత్త ఇన్నోవేషన్ తోపుడు స్ప్రేయర్

- పల్లె వీర రాఘవ రెడ్డి

రైతుల అవసరాల అనుగుణంగా ఎప్పటికప్పుడు నూతన స్ప్రేయర్లను తయారు చేస్తూ వస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన 'సుభాని సోదరులు' 2018 నూతన సవత్సర కానుకగా మరో స్ప్రేయర్‌ను అందిస్తున్నారు.

గతంలో బూమ్ స్ప్రేయర్ తయారు చేసి 'లిమ్కా బుక్ రికార్డ్స్'లో చోటు సంపాదించుకున్న సుభాని సోదరుల గురించి 'పల్లెసృజన' పాఠకులకు పరిచయమే. వీరు ప్రస్తుతం తయారు చేసిన స్ప్రేయర్‌కు ఎటువంటి ఇంధనం కానీ, పిచికారి చేసే వ్యక్తి చేతితో పని చేయటం కానీ అవసరం లేకుండా తయారు చేసిన ఈ స్ప్రేయర్‌ను మూడు చక్రాల ఒక చట్రంపై అమర్చారు. ఒక పిస్టన్‌తో పనిచేసే, 20 లీటర్ల నీటి ట్యాంకుతో గల ఈ స్ప్రేయర్ బరువు కేవలం 35 కిలోలు మాత్రమే వుంటుంది. అలాగే 35 లీటర్ల నీటి ట్యాంకుతో గల రెండు పిస్టన్‌ల స్ప్రేయర్ బరువు 60 కిలోల వరకు వుంటుంది.



ఈ స్ప్రేయర్లను మందునీటితో నింపి పొలంలో తోసుకుంటూ వెళ్తే చాలు పురుగు మందును పంటపై పిచికారి చేస్తూ వెళ్తుంది. ఒక్కరు లేదా ఇద్దరు వ్యక్తులు ఈ స్ప్రేయర్‌తో రోజుకు 5 ఎకరాల వరకు సునాయాసంగా మందును పిచికారి చేయవచ్చు. శనగ, వేరుశనగ లాంటి పంటలకు సింగల్ పిస్టన్ స్ప్రేయర్ సరిపోతుంది. పత్తి, మిరప మరియు ఇతర కూరగాయల పంటలకైతే రెండు పిస్టన్‌లు కలిగి స్ప్రేయర్‌తో పిచికారి చేసినట్లయితే మందు కాస్త ఎక్కువ వత్తిడితో పిచికారి చేస్తుంది.

పొలంలో మనిషి తోసుకుంటూ వెళ్ళే శక్తి వల్ల ఎక్కువ ఫోర్స్‌తో మందును పిచికారి చేస్తుందా అన్న అనుమానం

అక్కరలేదు. ఎందుకంటే స్ప్రేయర్‌ను తోసుకుంటూ వెళ్ళే మనిషి బలహీనుడైనా సరే స్ప్రే చేస్తూ వుంటుంది. ఈ స్ప్రేయర్‌లో సుభాని ఏర్పాటు చేసిన రిటర్న్ వాల్వ్ వల్ల తగినంత శక్తితో మందు పిచికారి చేయబడుతుంది. స్ప్రేయర్‌ను తోయటం కూడా ఎంతో సులువుగా వుంటుంది. మందు పిచికారి వేగాన్ని మనిషి శక్తిని బట్టి పెంచుకోవచ్చు, తగ్గించుకోవచ్చు.

అంతే గాక ఈ స్ప్రేయర్ సహాయంతో ప్రత్తి, పండ్ల తోటలు లాంటి వాటిలో చెట్టు దూరాన్ని బట్టి స్ప్రేయర్‌లో నియంత్రణ ఏర్పాటు చేసుకోవటం వల్ల ఆ చెట్టుపైన మాత్రమే మందు పిచికారి అయ్యేలా ఏర్పాటు చేశారు. దీన్ని సుభాని 'స్పాట్ స్ప్రేయర్' అంటాడు. అంటే స్ప్రేయర్‌ను తోసుకుంటూ వెళ్ళటం వల్ల ఇలాంటి పంటల్లో చెట్లు లేని చోట నేలపై మందు పిచికారి కావటం వల్ల వృధా జరగకుండా నియంత్రించాడు. చెట్లు దూరాన్ని బట్టి మందు స్ప్రే చేసే చోటును నియంత్రించుకోవచ్చున్నమాట. ఈవిధమైన పద్ధతి ఏర్పాటు చేసిన మొట్టమొదటి స్ప్రేయర్ ఇదే కావటం గమనార్హం.

ఎంతటి బలహీన వ్యక్తి అయినా, ఎటువంటి నేలల్లోనైనా సరే ఈ స్ప్రేయర్‌ను సునాయాసంగా నడుపుకుంటూ సమర్థవంతంగా మందును పిచికారి చేసుకోవచ్చు అంటాడు సుభాని. ఈ స్ప్రేయర్ వల్ల 60 పి.యస్.ఐ. నుండి 100 పియస్ఐ ఫోర్స్‌తో మందును పిచికారి చేస్తుంది. తైవాన్ పవర్ స్ప్రేయర్ శక్తి 200 పియస్ఐ, అలాగే మామూలు చేతిపంపు శక్తి 40 పియస్ఐ వరకు వుంటుంది. అంటే చేతి పంపుకన్నా ఎక్కువ, పవర్ స్ప్రేయర్ కన్నా తక్కువ ఫోర్స్‌తో పంటలపై మందును పిచికారి చేసుకోవచ్చు. రైతు పంటల అవసరాన్ని బట్టి ఒకటి లేదా రెండు సిలిండర్ల స్ప్రేయర్‌ను తీసుకున్నట్లయితే ఎటువంటి పంటల పైనైనా సరే సమర్థవంతంగా మందు పిచికారి





చేసుకోవచ్చు. అవసరం లేనపుడు ఒకే సిలిండర్‌తో కూడా పిచికారి చేసుకోవచ్చు. ప్రత్తి, మిరప, కూరగాయలు, పండ్ల తోటల్లో ఒకేసారి 2 నుండి 4 వరుసల వరకు మందును పిచికారి చేసుకోవచ్చు.

ఇటీవల గుంటూరులోని 'ల్యామ్ ఫామ్స్' వారు ఏర్పాటు చేసిన ఒక ప్రదర్శన శాలలో ఈ స్ప్రేయర్ పనితనాన్ని ప్రదర్శించగా, అక్కడి అధికారులు, రైతులు ఈ స్ప్రేయర్ చాలా బాగుందని కితాబు ఇచ్చారు. వీటి ధర సింగల్ పిస్టన్ స్ప్రేయర్ రూ. 7,500 మరియు డబుల్ పిస్టన్ స్ప్రేయర్, రూ. 13,000 వుంటుందని తెలియజేస్తున్నారు సుభాని సోదరులు. రైతులు ఆర్డరు చేసిన వారం రోజుల్లో అందించగలము అంటున్నారు.

సుభాని సోదరులు రైతాంగానికి ఇప్పటికే ఎన్నో రకాల వినూత్న స్ప్రేయర్లను అందించటం ద్వారా ఇప్పటికే కొన్ని లక్షల రూపాయల వృధాను అరికట్ట గలిగారు. రైతాంగం తాము తయారు చేసిన స్ప్రేయర్‌లను ఉపయోగించుకోవటమే కాదు, తమ పంటల వివరాలను అందిస్తే, మీకు తగిన స్ప్రేయర్‌ను తయారు చేయటంలో సిద్ధహస్తులు. ఇప్పటికే వీరు దాదాపు 10 రకాలకి పైగా స్ప్రేయర్లను తయారు చేశారు. వాటిని వినియోగిస్తున్న రైతులు ఎంతో ఆనందంతో తమ పొలాల్లో మందును పిచికారి చేసుకుంటూ, ఎంతో కూలీలను ఆదా చేసుకుంటున్నారు.

అనువైన స్ప్రేయర్‌ను కొనాలనుకున్న రైతులు క్రిందివారిని సంప్రదించండి :

**ఇన్నోవేటర్ సుభాని ఫోన్ : 98486 13687**

**పల్లెసృజన – రాఘవ రెడ్డి ఫోన్ : 81257 99904**

**మీరు చూడాలనుకుంటే ఈ స్ప్రేయర్ల వీడియోలను మీ వాట్స్ యాప్‌కు పంపబడుతుంది. పనితనాన్ని బట్టి మీకు కావలసిన స్ప్రేయర్లను ఆర్డరు చేసుకోవచ్చు.**



# ఆయుర్వేదం జ్ఞాన మధనం

# 'వాము'తో వైద్య చిట్కాలు

'వాము' పేరు వినని వారు ఉండరు. పూర్వం ప్రతి ఇంట్లో వాము తప్పనిసరిగా ఉండేది. వేగంగా మారుతున్న కాలంలో ప్రస్తుతం ఇంట్లో వాము బదులుగా, మాత్రలు, మందులు తప్పనిసరిగా ఉంటున్నాయి. నాడు చిన్న చిన్న రోగాలన్నిటిని వాముతోనే నయమయ్యేలా చేసేవారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా కలిగే ప్రతి చిన్నపాటి జబ్బులకు వాము అద్భుతమైన ఔషధం. ఈ పంట కేవలం ఆరోగ్యానికి సంబంధించిన మందులలో ఉపయోగించటానికి మాత్రమే కొనుగోలు చేస్తారు వ్యాపారులు. రైతుకు కూడా ఈ పంట చాలా తక్కువ ఖర్చుతో, ఎక్కువ లాభాన్ని ఆర్జించేది కావడం గమనార్హం. వాము ఉపయోగించటం వల్ల కలిగే లాభాలు, ఆరోగ్యానికి ఏవిధంగా ఉపయోగ పడుతుందో తెలియజేస్తున్నారు మన సాంప్రదాయ వైద్యులు. వాటి వివరాలలోకి వెళ్దాం....

### అబ్దుల్ కరీం, ఆత్మకూరు, కర్నూలు జిల్లా:

పూర్వం గ్రామాల్లో వేసవి కాలం వచ్చిందంటే కల్లాలలో వాము వాసన వస్తూ వుండేది. వాము పంటను రైతులు సేకరించి, తూర్పారబెట్టిన తర్వాత ప్రక్కన పడ్డ 'వాము పొట్టు'ను గర్భిణీ స్త్రీలున్న ప్రతి ఇంటివారు తీసుకుని వెళ్ళేవారు. ఎందుకంటే స్త్రీ ప్రసవించిన తర్వాత వేడి నిప్పులపై ఈ వాముపొట్టును వేసి కాపడం వల్ల చాలా రోగాలు రాకుండా నివారించడమే కాదు, ప్రసవించిన స్త్రీ శరీరం తిరిగి పూర్వపు స్థితికి రావటానికి ఈ ప్రక్రియ తప్పనిసరిగా వుండేది. అందుకే నాడు గ్రామాల్లో ఇంట్లోకి వెళ్ళినప్పుడు వాముపొగ వేసిన వాసన వస్తే 'ఇంట్లో ఎవరైనా ప్రసవించారా?' అని అడిగేవారు. అటువంటిది ఇప్పుడా సాంప్రదాయమే పూర్తి పడిపోయింది, అంతే కాదు సహజ ప్రసవాలు కూడా కరువై



పోయాయి. నాడు గ్రామాల్లో వాము ప్రాశస్త్యం అంతగా ఉండేది.

### పక్షవాతానికి వాముతో వైద్యం :

కొందరు వ్యక్తులకు పక్షవాతం లక్షణాలతో నోరు వంకర పోవటం జరుగుతూ వుంటుంది. ఇటువంటి వ్యక్తులకు కొద్దిగా వామును మెత్తగా పొడి చేసుకుని, ఆ తర్వాత వావిలాకు చెట్టు యొక్క చిగురుటాకులను కూడా అందులో కలిపి మెత్తగా నూరి ఆ పొడిలో కొద్దిగా అల్లం రసం వేసుకుని రోజూ ఉదయం, సాయంత్రం ఒక చెంచాడు పొడిని రోగి తీసుకున్నట్లయితే వంకర పోయిన నోటి నుండి మాట స్వచ్ఛంగా రావటంతో పాటు, వంకర కూడా కొద్దిగా తగ్గుతుంది. ఈ వైద్యం నేను చాలా మందికి చేశాను, మంచి ఫలితం వచ్చింది అంటున్నాడు కరీం. మాటలు బాగా రావటంతో పాటు పక్షవాతానికి గురైన చేతులు, కాళ్ళు కూడా కొద్దిగా నయమైనాయంటున్నాడు. పక్షవాతం పూర్తిగా నయం

కాదు కానీ, ఎంతో ఉపశమనం ఉంటుంది అంటున్నారాయన.

**చిన్నపిల్లలకు వాముతో వైద్యం :**

చిన్న పిల్లల్లో అజీర్తి, కడుపుబ్బరము కలిగిన వారికి వాము, శొంఠి, జీలకర్రలను సమానంగా తీసుకుని మెత్తగా నూరి కొద్దిగా పాలలో కలిపి నోట్లో వేసినట్లయితే పిల్లలకు బేదులు సాఫీగా కలుగుతాయి. కడుపులో రోగాలకు కూడా ఇది చాలా బాగా పని చేస్తుంది. గతంలో 'వాము వాటర్' అని పట్టణాల్లో విరివిగా లభించేది ప్రతి ఇంట్లో ఈ వాము వాటర్‌ను ఉపయోగించే వారు. చిన్న పిల్లలు ఎటువంటి ఇబ్బందికి గురయినా సరే ఈ వామునీళ్ళు తాగిస్తే అంతా సర్దుకు పోయేది.

**ఉమా మహేశ్వర రావు, మణుగూరు, భద్రాద్రి జిల్లా.**

వాముకి వేడి చేసే గుణం వుంది, చలువ చేసే గుణమూ ఉంది. వాముని కొద్దిగా వేయించి ఉపయోగించి నట్లయితే చలువ చేస్తుంది. నేరుగా తీసుకున్నట్లయితే వేడి చేస్తుంది. అయితే ఈ వేడి చేయటం ప్రమాదకరమైందేమీ కాదు. శరీరానికి సమశీతోష్ణం, వేడి రెండూ చేసే గుణాలున్నాయి. కొందరి శరీరాలలో వేడి గుణం ఎక్కువగా వుంటుంది. అటువంటి వారు వామును వేయించి వాడటం మంచిది.

**అజీర్తి రోగాలకు వాముతో వైద్యం :**

అజీర్తితో బాధపడేవారు వాములో రెండు మూడు రాళ్ళ ఉప్పు కలిపి నోట్లో వేసుకుని నమిలినట్లయితే పది నిమిషాల్లో అజీర్తి నుండి ఉపశమనం కలుగుతుంది.

**కడుపు నొప్పికి వైద్యం :**

వాము, ఉప్పు, మిరియాలు మూడింటిని సమపాళ్ళలో తీసుకుని మెత్తగా నూరి పొడిని తీసుకున్నట్లయితే ఎంతటి కడుపు నొప్పి అయినా సరే ఉపశమనం కలుగుతుంది.

**పాలు తాగే పిల్లల్లో ఆకలి గుణం పెంచటానికి వైద్యం :**

వామును కొద్దిగా తీసుకుని రాత్రి నీటిలో నానబెట్టి, ఉదయం ఆ నీటినుండి వామును తీసుకుని చేతిలో వేసుకుని బాగా నలిపినట్లయితే ఆ వాముపైనున్న పొట్టు రాలిపోయి, తెల్లటి గింజలు కనిపిస్తాయి. ఆ గింజలను కొద్దిగా నీటిలో బాగా మరిగించినట్లయితే వాటిని 'వాము పాలు' అంటారు. ఆ నీటిని చల్లార్చిన తర్వాత చిన్నపిల్లలకు తాపినట్లయితే తల్లిపాలు తక్కువగా వున్నవారు, పాలు తాగని పిల్లలకు ఆకలి గుణం పెరిగి బాగా పాలు తాగుతారు, అన్నం కూడా బాగా తింటారు. వాంతులయ్యే అవకాశాలు తక్కువ. ఇది చిన్న పిల్లలకు బలం కూడా.

**మెడిమ నొప్పులకు (మెడిమశూల) వాముతో వైద్యం :**

వాము, వెల్లిపాయ, కరివేపాకు మూడింటిని తీసుకుని మెత్తగా నూరి ఆ పేస్టును రాత్రిపూట మెడిమ నొప్పులు వున్నచోట పట్టించి, దానిపై ఒక ప్లాస్టిక్ కాగితం చుట్టి పడుకున్నట్లయితే, ఆ పేస్టులోని గుణాలన్నీ మెడిమకు పట్టుకుని మెడిమశూల (మెడిమ నొప్పులు) తగ్గిపోతాయి. ఈవిధంగా మూడు లేదా నాలుగు రోజులు చేయాల్సి వుంటుంది.

**చిన్న చిన్న నొప్పులకు వాముతో వైద్యం :**

వామును నూనెలో బాగా మరిగించి, ఆనూనెను కండరాల నొప్పులు, బెణుకుల నొప్పులు లేదా కీళ్ళ నొప్పులు వున్నవారు ఆ భాగాల్లో పట్టించినట్లయితే చిన్న చిన్న నొప్పుల నుండి వెంటనే ఉపశమనం పొందుతారు.

**ఆకలి గుణం పెంచటానికి చిట్కా వైద్యం :**

వాము, జీలకర్ర, మిరియాలు, శొంఠి ఈ నాలుగింటిని సమానంగా తీసుకుని మెత్తటి పొడి చేసిపెట్టుకుని ఒక సీసాలో భద్రపరచుకొని ఇంట్లో వుంచుకోవాలి. చిన్నపిల్లలైనా, పెద్దవాళ్ళైనా సరే ఒక చెంచాడు పొడిని తేనెలో కాని, పాలలో కాని కలిపి తీసుకున్నట్లయితే ఆకలి గుణం పెరుగుతుంది. ఆకలి వేయక, అన్నం తినటానికి ఇష్టపడని వారికి ఇది మంచి ఔషధం.

**వాతావరణ మార్పుల వల్ల వచ్చే రోగాల నిరోధనకు వైద్యంతో కూడిన ప్రసాదం :**

పూర్వం కృష్ణాష్టమి పండుగకు 'కాయం' అని ఒక నైవేద్యం తయారు చేసేవారు. ఈ పండుగ వర్షాకాలంలో వస్తుంది. వాతావరణ మార్పుల వల్ల వచ్చే రోగాల నియంత్రణ కు ఈ కాయం ప్రసాదంగా అందరికీ పంచేవారు. దీన్ని కొద్దిగా (కుంకుడు కాయంత) తీసుకున్నట్లయితే ఎన్నో రోగాలకు నిరో ధకంగా మారేది. వాము, మిరియాలు, శొంఠి, పటిక బెల్లం కలిపి మెత్తగా నూరి, అందులో ఆవు నెయ్యి వేసి చిన్న చిన్న ఉండలుగా చేసి నైవేద్యం తర్వాత ప్రసాదంగా పంచుతారు. ఈ విధంగా చేయటం వల్ల జలుబు, దగ్గు, జ్వరం లాంటి వాతావరణ మార్పుల వల్ల వచ్చే రోగాలు నిరోధించబడేవి.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 11 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 11వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2019** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK

మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :

National Innovation Foundation,
C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road,
Gandhi Nagar, Gujarat-382 721,
Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903,
Email: campaign@nifindia.org, Website: www.nif.org.in

GIAN

సూచన : వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : **040–27111959**) సంప్రదించండి.

# 'పల్లెసృజన'తో నా ప్రయాణం....

## - పల్లె వీర రాఘవ రెడ్డి

ఓ శుభ ముహూర్తాన నన్ను ఉన్నత భావాలతో రక్షణ రంగం నుండి విశ్రాంత జీవితం గడపటానికి వచ్చిన బ్రిగేడియర్ గణేశం గారితో నన్ను పరిచయం చేసిన కే.శే. కశోర్ఘుల లోకేందర్ రావు గారికి నేను ఎప్పటికీ రుణపడి వుంటాను. 2006లో నేను ఓ సాధారణ ముద్రణా వ్యాపారం చేసుకుంటున్న వ్యక్తిని. పల్లెసృజన పరిచయం నాలో నేనే ఊహించని మార్పులు తీసుకు వచ్చిందని సగర్వంగా చెప్పుకోగలను. పల్లెసృజన ప్రారంభమైన 4 సంవత్సరాల తర్వాత మా స్వగ్రామమైన కర్నూలు జిల్లా, కల్లూరు మండలం లోని బొల్లవరం గ్రామానికి వెళ్ళినపుడు నా మిత్రుడు సూరేంద్ర గౌడు నా కారు వెనక 'పల్లెసృజన' అని వ్రాసిన అక్షరాలు చూసి "మీ ఇంటి పేరుతో ఓ పత్రికనే నడుపుతున్నావా?" అన్నప్పుడు నేను ఎంతో ఆశ్చర్యానికి గురయ్యాను. ఎందుకంటే అంత వరకు ఈ పత్రిక పేరులో నా ఇంటిపేరు ఉందన్న విషయమే గమనించలేదు అంటే అంతగా మమేకమైపోయానన్నమాట. 'పల్లె' అంటే గ్రామం, 'సృజన' అంటే ఇన్నోవేషన్ అని మాత్రమే ఆలోచించి పెట్టిన పేరిది. ఇందులో నా ఇంటిపేరుండటం యాదృచ్ఛికమే. నాటినుండి ఈ పత్రికను తయారు చెయ్యటంలో ఇంకా ఎక్కువ కష్టపడాలని నా వ్యాపారాన్ని కొద్ది కొద్దిగా తగ్గించుకుంటూ ఇప్పుడు దాదాపు పూర్తిగా 'పల్లెసృజన'కే అంకితమయ్యేలా చేసింది.

'పల్లెసృజన' నాలో ఎన్నో మార్పులు తీసుకు వచ్చిందని నిర్ద్వందంగా చెప్పగలను..... మనిషిలో 'మంచి'ని మాత్రమే గ్రహించే గుణం నేర్పింది. సుహృద్భావం (పాజిటివ్ థింకింగ్) నేర్పింది. కొత్తదనాన్ని వెతకటం నేర్పింది.





ముఖ్యంగా కేవలం 10వ తరగతి చదివిన నన్ను ఓ పత్రికా రచయితను చేసింది. సాధారణ వ్యక్తినైన నన్ను దేశ రాజధాని లోని భారత రాష్ట్రపతి భవనం వరకు తీసుకు వెళ్ళింది. ఎంతటి కష్టాన్నయినా చిరునవ్వుతో స్వీకరించే గుణాన్ని నేర్పింది...... ఇలా చెప్పుకుంటూ వెళ్తే నాలో ఎన్నెన్ని మార్పులు తెచ్చిందో..!!! ఏమి చేసి ఈ 'పల్లెసృజన' రుణం తీర్చుకోగలను. నాకు చేతనైనంత సహకారం అందించటం తప్ప. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, ఎన్నో రాష్ట్రాల్లోని ఇన్నోవేటర్లు, ప్రధాన వ్యక్తులతో పరిచయం కావడం కేవలం పల్లెసృజన భిక్ష అని భేషజం లేకుండా చెప్పగలను.

ఇక ఈ పత్రికలో ప్రధాన భూమిక పోషించే స్థాయికి నాలో, నా రచనల్లో మెళకువలు నేర్పిన పత్రిక ఎడిటర్ జమ్మలమడక శశిమోహన్ గారి ఆప్యాయత నన్నెప్పుడూ పులకింప జేస్తుంది. నేను చేస్తున్న పనులకు ఎప్పుడూ వెన్నంటి ప్రోత్సహిస్తున్న చంద్రకాంత్ శర్మ, జాగర్లమూడి దుర్గాప్రసాద్, జమ్మలమడక శ్రీకర్ గార్ల అభిమానం మరువలేనిది.

నేను ఈ పత్రికకు చేసిన మొదటి ఇంటర్వ్యూ 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత చింతకింది మల్లేశం గారిది కావడం మరపురాని మధుర జ్ఞాపకం. ఉభయ రాష్ట్రాల్లోని ఎందరో ఇన్నోవేటర్ల స్నేహ భావం ఎప్పుడూ మదిలో మెదలుతునే వుంటుంది. ప్రత్యక్షంగా కొందరు ఇన్నోవేటర్లను, పరోక్షంగా (పత్రికలో ప్రచురించటం ద్వారా) కొందరు ఇన్నోవేటర్లను కలుసుకోవటంతో ప్రస్తుతం ఉభయ రాష్ట్రాల్లోని దాదాపు ప్రతి జిల్లాలో పరిచయాలు ఏర్పడటం గర్వకారణం.

ఈ 'పల్లెసృజన' పత్రిక ప్రతి గ్రామాన్ని చేరుకునేలా చేసి, మారుమూల (గ్రాస్‌రూట్స్) స్థాయిల్లో మరుగున పడుతున్న సృజనలను వెలుగులోకి తీసుకు రావాలన్న మా కల త్వరలోనే నెరవేరుతుందని ఆశిస్తున్నాను. 'పల్లెసృజన' 60వ (షష్ఠిపూర్తి) సంచిక విడుదల సందర్భంగా పాఠకులకు శుభాకాంక్షలు.

# విశాఖపట్నం జిల్లాలో 25వ చిన్నశోధయాత్ర-జ్ఞాన యాత్ర



**బి. ఇంద్రాణి, అరవింద్ స్కూల్, కుంచనపల్లి.**

పల్లెసృజన వారి 'చిన్న శోధయాత్ర' ఒక జ్ఞాన యాత్ర. 15-17 డిశంబర్‌లో జరిగిన ఈ శోధయాత్ర విశాఖ జిల్లా కొత్తకోట నుండి కొమ్మంగి వరకు 52 కిలోమీటర్ల నడకలో ఎంతో జ్ఞానాన్ని, తృప్తిని, ఆత్మ విశ్వాసాన్ని ఇచ్చింది. ప్రకృతితో, గ్రామాలలో, యాత్రికులతో, మనతో మనం మమేకమై సాగిన ఈ మూడురోజులు జీవితంలో అత్యంత మరపురాని రోజులుగా నిలిచిపోయాయి.

ఇది జ్ఞాన యాత్ర కాదు సాహస యాత్ర. 'జ్ఞాన గని' బ్రిగేడియర్ శ్రీ పి. గణేశం గారితో నడక, వారి మాటలు, ఇన్నోవేటర్ల కథలు, కథనాలు, గ్రాస్‌రూట్‌లో అంటే పల్లెల్లో, రైతుల్లో, పెద్దల్లో వున్న జ్ఞానం, అన్ని కిలోమీటర్లలో వచ్చే కొండలు, గుట్టలు, మట్టిరోడ్లు, పచ్చటి పొలాలు, బీళ్ళు, తోటలు, సెలయేర్లను దానుకుంటూ, చిమ్మ చీకట్లో నక్షత్రాల వెలుతురులో ప్రయాణం ఎవరికి వారు ఎంత నేర్చుకుంటామో కదా!

ఎన్నో సంవత్సరాల అనుభవంలోంచి, కష్టాల్లోంచి బయటకొచ్చిన సృజనాత్మకతను వెతికి సమాజానికి తెలియపరచటం, సృజనాత్మకత గల వ్యక్తులను (ఇన్నోవేటర్స్‌ని) గౌరవించి, వారిని ప్రపంచానికి పరిచయం చేయాలన్న ప్రధాన లక్ష్యంతో 2005లో బ్రిగేడియర్ పి. గణేశం గారి ఆధ్వర్యంలో ఏర్పాటయిన స్వచ్ఛంద సంస్థ 'పల్లెసృజన'. పల్లెల్లోని జ్ఞానవేత్తల జ్ఞానాన్ని గుర్తించి, గ్రంథీకరించి, ఆ జ్ఞానాన్ని సమాజానికి అందించటంతో పాటు, ఆ జ్ఞాన వార్తను సమాజం గుర్తించేలా చేయటం. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.)లో భాగంగా ఈ శోధయాత్రల ద్వారా విద్యార్థులను 'ఇగ్నైట్' ప్రాజెక్టుల గురించి, వారిలో నిబిడీకృతమై వున్న సృజనను బయటకు తీసే ఈ కార్యక్రమమే శోధయాత్ర.

'పల్లెసృజన' ఆధ్వర్యంలో డిసెంబర్ 15-17న సాగిన ఈ చిన్న శోధయాత్రలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను .

మొదటి రోజునుండే అదే స్ఫూర్తితో, అదే సహనంతో అంతే పాషనేట్‌గా ఇన్నోవేషన్స్ కథనాలను వినిపించే గణేశం గారు ఎంత మహానుభావులో ... ఆయనో పెద్ద గురువు. 'కాటలిస్ట్‌ని మాత్రమే నేను' అని ఆయన అంటున్నా ఎంతోమందిని ప్రోత్సహించి వారి ఇన్నో'వేషన్'కి ఒక గుర్తింపు తెచ్చే క్రమంలో, ప్రభుత్వ నిధులు సరిగ్గా ఖర్చు అయ్యేట్లుగా పనిచేసే విధానం, లంచాలకు, అవినీతికి దూరంగా ఎవరికి వారు వారి శక్తి సామర్థ్యాలపై నమ్మకం పెట్టుకొనే విధంగా ఆయన చేస్తున్న ఈ మహాయజ్ఞం మరింత మందికి చేరువ కావాలని మనసారా కోరుతున్నాం.

ఎటువంటి ఖర్చు లేకుండా నామమాత్రపు



ఖర్చుతో ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకుంటూ, ఆరోగ్యంగా, ఆనందంగా ఇలాంటి యాత్రలు అందరూ చేయాలి కదా అన్పించక మానదు. ఈ యాత్రలన్నీ ప్రకృతి ఒడిలోనే కాబట్టి రోజువారి సిటీ గందర గోళానికి దూరంగా ప్రకృతిలో గడపటం ఎంత అద్భుతమో, నిశ్శబ్దంగా, అంతరాత్మతో మాట్లాడుకుంటూ అక్కడక్కడా వినిపించే పల్లె మాటలు, పక్షుల కూతలు, సహచరుల సంషణలు, పల్లెతిండి, పల్లెనిద్ర మరవలేనివి.

మధ్యలో కన్పడే స్కూలు పిల్లలకు ఈ జ్ఞానాన్ని పరిచయం చేయటం వారిని కూడా ఏదైనా కనిపెట్టమని ప్రోత్సహించడం, అప్పటికీ ఏమైనా కనిపెడితే వాటిని అందరికీ పరిచయం చేసి వాటికి పేటెంట్ తెప్పించి, వీటికో మార్కెట్ కల్పించడం. అతి తక్కువ ధరలో అతి సులువుగా పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా, రైతు కష్టాన్ని కాస్తంత సులువు చేసి, వ్యవసాయంపై మమకారం కోల్పోకుండా చేయటం పల్లె'సృజన' చేస్తున్న పని. ఇలా ఎన్నో ఇన్నోవేషన్స్ బహుళ ప్రయోజనాల (డ్రమ్ సీడర్) ఎరువులు చల్లే సోలార్ యంత్రం, సోలార్ స్ప్రేయర్, పెడల్ పంపు, కరెంటు స్తంభాలనెక్కే సాధనం, పంచర్‌కాని ట్యూబులు, తోపుడు నాగలి, గ్రాస్ కట్టర్, శ్రీవరి వీడర్, ముక్కు ఫిల్టర్ ఇంకా ఎన్నో.... ఎన్నెన్నో... 'పల్లెసృజన' ఇన్నోవేటర్ల కనిపెట్టినవి.

ఎంతోమంది స్నేహితులను కలుస్తాం. ఎన్నో కబుర్లు చెప్పుకుంటాం. తెలియని కొత్త విషయాలు తెలుసుకుంటాం. మొబైల్ లేకుండా, కరెంటు లేకుండా, సరిపోయినంత నీరు లేకుండా, రోజుకో 20 కిలోమీటర్లు నడిచి హాయిగా బ్రతకవచ్చని నిరూపిస్తుంది ఈ యాత్ర. ప్రకృతిపై, పల్లె మనిషిపై, తోటి యాత్రీకులపై మనపై మనకు నిరంతరం సహకరించే మన శరీరం, మెదడు, మనస్సుపై మనకెంతో ప్రేమ పెరుగుతుంది. స్వచ్ఛంగా, స్వతంత్రంగా ఆలోచిస్తాం. పిల్లలకు మరింత చేరువౌతాం. ముఖ్యంగా వారింట్లో మనచుట్టూ వున్న పెద్దలపై గౌరవాన్ని పెంచుకుంటూ, పర్యావరణాన్ని కాపాడుకోవటానికి ఆరాటపడతాం. ఇలాంటి అందమైన పల్లెలు కలకాలం మన ముందు తరాలకు మిగలాలని కొరుకుంటాం.

ఈ మొత్తం యాత్రలో ఈ పల్లెల్లో ఎక్కువమంది వ్యవసాయంపైనే ఆధారపడి వున్నారు. 20 నుంచి 25 శాతం పిల్లలు మాత్రమే వేరే ఉద్యోగాలకు వెల్తున్నారు. ఎందుకంటే పెద్దలకు పిల్లలంటే అంత ప్రేమ. పిల్లలు హాయిగా తమముందు ఉంటే చాలనే చల్లని మనస్సు. ఎక్కడా రణగొణ ధ్వనులు, ఆడంబరాలు, మేడలు, అపార్ట్‌మెంట్‌లు లేవు. చాలా గ్రామాల్లో 10 ఎకరాలున్న రైతులు లేరు. అందరూ చిన్న రైతులు, రెక్కల కష్టంపైనే ఆధారపడేవారే. కొర్రలు, సామలు, అరికలు, తైదలు తినేవారు ఇప్పుడు తెల్లబియ్యం తినటంతో





మకు జబ్బులొస్తున్నాయని అందరూ అభిప్రాయ పడ్తున్నారు. కాని వాటిని పండించటానికి ఇష్టపడటం లేదు. తక్కువ ఉష్ణోగ్రతతో, ఆంధ్రా కాశ్మీరుగా పేరొందిన 'లంబసింగి'లో మాత్రం ప్రకృతిని కొల్లగొట్టడం అంటే అక్కడ రిసార్టులు, హోటళ్ళు ప్రారంభమౌతున్నాయి. ఏజన్సీ ప్రాంత భూములు గిరిజనుల పేర్లమీద ఉన్నా ఏదో తప్పులు చేసి ఇటువంటివి చేస్తారేమో. ఆదివారాలు రద్దీగా చాలా కార్లు, వాటిలో కుర్రాళ్ళు, మందు, బిర్యానీ సెంటరు ఇవన్నీ చూసి అమ్మో లమ్మసింగ్ (లంబసింగి) కూడా కలుషితమవుతోంది అన్పించక మానదు.

మనిషి జీవనానికి అవసరమైన ఆహారాన్నందించే గ్రామాలు కలకాలం పచ్చగా ఉండాలని, ఔత్సాహిత యువత భూమాతను కాపాడుతుందని మన ఆశ. ఇంతమంచి సత్కార్యాన్ని చేతబూనిన పెద్దలు బ్రిగేడియర్ గణేశం గారు ధన్యులు. ఏమీ ఆశించకుండా పని చేసే వాలంటీర్లకు కూడా మనమెంతో ఋణపడి ఉంటాం.

**బండారి రమేష్, హైదరాబాద్ :**

నేను పాల్గొన్న 10వ శోధయాత్ర ఇది. గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగిన నాకు కూడా ఇలా 45మంది తోటి యాత్రీకులతో శోధయాత్రలో పాల్గొనటం అదో రకమైన తృప్తి అనిపించింది. యాత్రలో ఒకచోట ఒక మహిళ వరి కోస్తున్న దృశ్యం చూసి ఆమెవద్దకు వెళ్ళి ఆమెతో మాట్లాడగా, తనకు ఉదయం నుండి సాయంత్రం దాకా ఇలా వరి కోస్తే వచ్చే కూలి 120 రూపాయలు అనటంతో డబ్బు ఎంత విలువైందో తెలిసింది.

మాతో యాత్రలో పాల్గొన్న వారిలో అంజిరెడ్డి గారిని చూస్తుంటే ఒక గ్రంథం మాతో నడిచి వస్తుంది అనిపించింది. అందరు అడుగుతున్న ఎన్నో ప్రశ్నలకు ఆయన ఇచ్చే సమాధానాలు ఎంతో తృప్తినిచ్చాయి. అలాగే సత్యేంద్రసింగ్, విజయ్ కుమార్, లక్ష్మి, ఫయాజ్ వంటి యాత్రీకుల నుండి ఎంతో నేర్చుకున్నానని చెప్పటానికి సంతోషిస్తున్నాను.

రెండవ రోజు యాత్రలో సాయంకాలం ఒక గ్రామ ప్రజలతో మాట్లాడుతుండగా ఒక ఆసక్తికరమైన విషయం తెలిసింది. "మీ గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా?" అని అడగగా, వారు ఎంతోసేపు ఆలోచించి, చిన్న చిన్న సమస్యలు చెప్పారు. వారివల్ల మేము ఉన్నంతలో సర్దుకుపోవటం అంటే ఏమిటో దానివల్ల లాభాలేమిటో తెలుసుకున్నాము.

తమ గ్రామాల్లోని యువకులు తమ గ్రామానికి సేవలు అందించాలన్న భిన్నమైన వ్యక్తిత్వాన్ని కొన్ని గ్రామాలలో పరిశీలించాము. అలాగే బ్రిగేడియర్ గణేశం గారు చెప్పిన మల్లేశం, పాండురంగారావు, గల్లా చంద్రశేఖర్ లాంటి ఇన్నోవేటర్ల కథలు ఎంతో ఆసక్తిని కలిగించాయి.



ఇలా తోటి యాత్రీకులనుండి, ప్రకృతి నుండి, గ్రామ ప్రజల నుండి మేము నేర్చుకుంటూ మరో శోధయాత్రకోసం ఎదురు చూస్తూ 25వ శోధయాత్ర ముగించాము.

**సంతోష్ నాయక్, హీతం కళాశాల, హైదరాబాద్ :**

ఈ 25వ చిన్నశోధయాత్ర నేను పాల్గొన్న మొదటిది. మొదటిదే అయినా నాకు జీవితానికి సరిపోయే అందమైన జ్ఞాపకాలను మిగిల్చింది. నా ఉద్దేశ్యంలో ఈ శోధయాత్రలలో మనచుట్టూ జరిగే అనేక విషయాలను గురించి తెలుసుకునే అవకాశం వుంటుంది. ఈ మూడరోజుల శోధయాత్రలో మనం ఎదుర్కొనే అనేక సమస్యలకు మనమే సమాధానాలు వెతుక్కోవచ్చు అన్న విషయం గ్రహించాను.

సాధారణంగా నాలుగైదు కిలోమీటర్లకన్న ఎక్కువ నడిచే అలవాటు లేని నేను ఈ శోధయాత్రలో 52 కిలోమీటర్లు నడిచాను అంటే నాకే నమ్మశక్యం కాలేదు. ఇది కేవలం బ్రిగేడియర్ గారు ఇచ్చిన ప్రోత్సాహము మరియు అనేక గ్రామస్థాయి ఇన్నోవేటర్లను గురించిన వివరాలు కథలుగా, ఉద్విగ్న భరితంగా చెప్పటంతో స్ఫూర్తి చెంది ఈమాత్రం చేయలేమా అనిపించి నడిచేసి వుంటాము. ఈ యాత్రలో గ్రామస్తులను గురించి నేను పొందిన ఆప్యాయత అనురాగాలు వర్ణనాతీతం. ఆహ్లాదకరమైన ప్రకృతిలో నడవడం అదో అనుభూతి.

శోధయాత్ర అనేక పాఠాలు నేర్పిస్తుంది. ముఖ్యమైనది మితమైన సదుపాయాలతో జీవించడం. ఈ యాత్రలో





ఇటుకల తయారీలో వేడిని నియంత్రించే పద్ధతి గురించి, అలాగే ప్రకృతిసిద్ధమైన వైద్యం గురించి తెలుసుకున్నాను. అందమైన గ్రామాలు, ఇంకా అందమైన గ్రామస్తుల మధ్య యాత్ర కొనసాగింది.

ఏమాత్రం పరిచయం లేని తోటి యాత్రీకులతో మూడు రోజులు గడిపేసరికి ఆత్మబంధువులకన్నా ఎక్కువగా ఒక కుటుంబంలా మారిపోయింది. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఇంకా నయం ఈ యాత్రలో పాల్గొనకపోతే ఇంతమంది మిత్రులను కోల్పోయేవాళ్ళం అనిపించింది. ఇటువంటి ఆత్మీయులతో చీకటి రాత్రులలో, నక్షత్రాల వెలుగులో నడవటం అన్నది ఎంతో అదృష్టం వుంటే తప్ప దక్కని అవకాశం.

అందరూ స్వచ్ఛంద సేవకులే అయినా యాత్ర మొత్తంలో ఎవరికీ ఏవిధమైన కష్టమూ జరగకుండా కనీస సదుపాయాలే అయినా అందరికీ అందేలా చూసిన వాలంటీర్లకు ప్రత్యేకమైన ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను. ఈ యాత్రకి మూలకారణమైన 'పల్లెసృజన' మరియు బ్రిగేడియర్ గారికి ధన్యవదాలు. ఇంకొకసారి అవకాశం వస్తే తప్పనిసరిగా వెళ్ళాల్సిన యాత్ర ఈ శోధయాత్ర.

## 'పల్లెసృజన' పాఠకులకు విజ్ఞప్తి

'పల్లెసృజన' పత్రిక ప్రతి గ్రామానికి చేరుకున్నట్లయితే ఇంకా ఎన్నో ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానాలు వెలుగులోకి వస్తాయి. అలా జరగాలంటే ప్రతి పాఠకుడు తమకు అనుబంధమున్న వారితో 'పల్లెసృజన' చందా కట్టించి ఈ యజ్ఞంలో మీరూ పాలు పంచుకుంటారని ఆశిస్తున్నాం.

– ఎడిటర్.

**ఎడిటర్‌గారికి,**

మీ పత్రికను నేను క్రమం తప్పకుండా చదువుతూ వుంటాను. నేను చదివిన తర్వాత నా మిత్రులందరికీ ఇచ్చి వారిచేతా చదివిస్తాను. ఆ తర్వాత దానిని ఒక మంగళి షాపులో ఇస్తాను. అక్కడ చాలా మందికి అందులోని వివరాలను తెలుసుకునే అవకాశం వుంటుందని నా అభిప్రాయం. నేను మనీ ఆర్డర్ ద్వారా డబ్బు పంపాను, అందిన వెంటనే నాకు 5 సంవత్సరాల కాలం 'పల్లెసృజన' పత్రిక పంపగలరు.

**– వి. నాగేశ్వర రావు,** వి. హెచ్. ఇ. ఎల్., రామచంద్రాపురం, హైదరాబాద్.

**నాగేశ్వర రావు గారికి,** 'పల్లెసృజన' పత్రిక మీరు చదవటమే కాకుండా, నలుగురిచేతా చదివింప జేయాలనే మీ ఆలోచన మాకెంతో నచ్చింది. మా ప్రయత్నం కూడా పత్రిక సర్క్యులేషన్‌తో నిమిత్తం లేకుండా ఎక్కువ మందిచేత చదివింప జేయాలన్నదే. మీ ప్రయాసకి, మీ పత్రిక చందా పునరుద్ధరించినందుకు మా ధన్యవాదాలు. **– ఎడిటర్.**

**బ్రిగేడియర్ గణేశం గారికి,**

వివిధ రకాల గ్రామీణ ఇన్నోవేషన్‌ల గురించి తెలుసుకొని చాలా ఆనందానికి గురయ్యాను. 'పల్లెసృజన' పత్రిక కొరకు మనీ ఆర్డర్ ద్వారా డబ్బు పంపుతున్నాను. మీరు చేస్తున్న సామాజిక సేవలో పాల్గొనాలని నిశ్చయించుకున్నాను. మీరు ఎప్పుడు ఖాళీగా ఉంటాలో చెబితే మిమ్మల్ని కలవాలనుకుంటున్నాను. **– డా. జి. సంపత్ కుమార్,** హైదరాబాద్.

**సంపత్ కుమార్ గారికి,** చాలా సంతోషం. మీలాంటి విద్యాధికులు మా 'పల్లెసృజన' కార్యక్రమాలలో పాల్గొనటం చాలా మంచి పరిణామం. ఈ రంగంలో ఎంతమంది ఎంత చేసినా తక్కువేనని మా అనుభవం చెబుతోంది. మీరు ముందుగా తెలియజేసి వచ్చి కలుసుకోవచ్చు. **– బ్రిగేడియర్ పి. గణేశం.**

**బ్రిగేడియర్ గారు,**

'పల్లెసృజన' నవంబరు–డిశంబరు–2017 పత్రిక మా ఇంటికి చేరగానే ఆసాంతం చదివాను. గ్రామీణ ఇన్నోవేటర్ల సాంకేతిక ప్రజ్ఞ నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది. గత అయిదు దశాబ్దాలుగా నా ఇంజనీరింగ్ అనుభవం వారి సరళమైన, సరియైన అందుబాటులో ఉండే ఇన్నోవేషన్లను తయారు చేసిన విధానం ముందు చిన్నబోయింది. సహజమైన ఆలోచనా తీరు, పరిసరాలకు కనీస నష్టం కలగకూడదన్న భావనతో సైదాచారి లాంటి ఇన్నోవేటర్లు తయారు చేసే పరికరాలు ఇంజనీరింగ్ రంగంలో అత్యున్నత స్థాయికి చెందిన మేధస్సు. 'పల్లెసృజన' ఇలాంటి కనీవినీ ఎరుగని పల్లెజ్ఞానాన్ని వెతికి, వెలికి తీసే మాలాంటి వారికి అందజేసి, మా కళ్ళు తెరిపిస్తున్నందుకు కృతజ్ఞతలు. మీరు చేసే 'పల్లెజ్ఞాన' ఉద్యమానికి నా తోడు ఎల్లప్పుడూ ఉంటుంది. శుభాకాంక్షలతో... **– ఎయిర్ వైస్ మార్షల్ ఎన్.ఎస్. శాస్త్రి (రిటైర్డ్)**

**శాస్త్రి గారూ,** ఉన్నత పదవిలో పనిచేసి విశ్రాంత జీవనం గడుపుతున్న మీలాంటి వారి అభిమానాన్ని చూరగొనటం 'పల్లెసృజన' అదృష్టంగా భావిస్తున్నాము. మీలాంటి వారి సేవలను మేమెప్పుడూ స్వాగతిస్తాము. **– బ్రిగేడియర్ గణేశం (రిటైర్డ్)**

## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,**<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. Printer's Name | : | **P. Ganesham** |
| Nationality | : | Indian |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post,<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. Publisher's Name | : | **P. Ganesham** |
| Nationality | : | **Indian** |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post,<br>Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. Editor's Name | : | **J. Seshi Mohan** |
| Nationality | : | **Indian** |
| Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

## గ్రామీణుడి ఇన్నోవేషన్

# వంటపాత్రలు కడిగే యంత్రం



- మనం వంటింటి పాత్రలన్నిటినీ శుభ్రపరచుటకు అనుకూలంగా డిజైన్ చేయబడింది.
- నూనె జిడ్డును, మాడిన ఆహార పదార్థాల అవశేషాలను సమర్థవంతంగా తొలగించి శుభ్రపరచ గలదు.
- కట్టెల పొయ్యిపై ఉపయోగించే పాత్రల మసిని కూడా చాలా బాగా శుభ్ర పరచగలదు.
- దీనికి నాలుగు రకాల క్లీనింగ్ బ్రష్‌లు ఉంటాయి. వాటి ద్వారా రకరకాల పాత్రలను శుభ్రపరచవచ్చు.

  **ఐరన్ బ్రష్ :** దీనితో మాడిన ఆహార పదార్థాల అవశేషాలను, మసిని తొలగించవచ్చు.

  **ప్లాస్టిక్ బ్రష్ :** దీనితో అన్ని రకాల పాత్రలను శుభ్రపరచవచ్చు.

  **క్లాత్ బ్రష్ :** దీనితో స్టీలు పాత్రలను మెరిసిపోయేలా చేయవచ్చు.

  **లాంగ్ బ్రష్ :** దీనితో గ్లాసులు, చెంబులు, మగ్గులు, వాటర్ బాటిల్స్‌ను శుభ్రపరచవచ్చు.
- ఇది కేవలం 200 వాట్ల విద్యుత్‌ను మాత్రమే వినియోగించుకుంటుంది.
- దీనిని ఉపయోగించుటకు ప్రతిసారి స్విచ్ ఆన్, ఆఫ్ చేయనవసరం లేదు. సెన్సార్లతో ఈ యంత్రం పని చేస్తుంది.
- ఈ యంత్రం నీటి వృధాను చాలా సమర్థవంతంగా అరికడుతుంది.
- పూర్తిగా ఆటోమేటిక్‌గా ఆపరేట్ అవుతుంది. కాబట్టి ప్రమాద రహితంగా వుంటుంది.
- స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారైన దీనిని ఎక్కడైనా సులభంగా అమర్చుకోవచ్చు. ఉపయోగించడం ఎంతో సులభం, నిర్వహణ ఖర్చు చాలా తక్కువ.
- ఈ యంత్రం ఉపయోగించటం వల్ల మహిళల శ్రమ చాలావరకు తగ్గుతుంది.

**కావాల్సిన వారు సంప్రదించండి :**

For further queries Please contact


**Mr. B Subhash Chander**

AGM, Creative Minds,

**Plot No 67, Road no 2, Vayupuri, Post Sainikpuri, Secunderabad -500094**

**Ph. : 040-27111959, 9652801700**

E-mails : creativemindsap@gmail.com, boddu.subhash4@gmail.com

PALLESRUJANA Telugu Bi-monthly January - February 2018 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**



### చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904